WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టై ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

RNI: APTEL/2020/79173 జాతీయ తెలుగు దినపత్రిక
www.swarnasagaram.com


ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 52 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | బుధవారం 25 ఫిబ్రవరి 2026 | వెల : 2-00



## నేటి నుంచి మోదీ ఇజ్రాయెల్ పర్యటన

- ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో అనేక అంశాలపై సంప్రదింపులు జరపడంతోపాటు ఆ దేశ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌తో సమావేశం కానున్నారు
- రక్షణ, భద్రత రంగాల్లో సహకారంపై ప్రధానమంత్రుల ప్రతినిధి బృందాలు విస్తృతంగా చర్చించనున్నాయి
- నెతన్యాహు బుధవారం రాత్రి ఏర్పాటు చేయనున్న వ్యక్తిగత విందులో మోదీ పాల్గొంటారు.

2




## బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

- దేశవ్యాప్తంగా అందించనున్న కేంద్రం
- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు చర్యలు
- 14 ఏళ్ల వయసున్న బాలికలకు సింగిల్ డోస్ గార్డాసిల్

## భక్తుల సేవకే పెద్దపీట

### శ్రీవారి ప్రతిష్ఠ దెబ్బతీసే కుట్ర



- కల్తీ నెయ్యి సహా మరెన్నో దుర్మార్గాలు
- రాజశేఖరరెడ్డి హయాంలోనే కుట్ర మొదలు
- జగన్ హయాంలో మరింత అరాచకం
- వారు తప్పుచేసి మమ్మల్ని క్షమాపణ చెప్పాలంటున్నారు
- తితిదేలో ప్రక్షాళన చేపట్టాం
- శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, స్వర్ణసాగరం

భక్తులంతా ఏడుకొండలవాడా అని స్మరిస్తూ కొండెక్కుతారు. కానీ రాజశేఖరరెడ్డి తిరుమల రెండు కొండలే అని ఉత్తర్వులిప్పించారు. అప్పుడు పంచాయతీరాజ్ కార్యదర్శి శామ్యూల్.. దేశవ్యాప్తంగా ఆందోళన రావడంతో మళ్లీ ఏడుకొండలుగా మార్చారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడే ఎస్వీ యూనివర్సిటీ కాలేజీకి దేవసంగీతం అనే వ్యక్తిని ప్రిన్సిపల్‌గా నియమిస్తే.. ఆయన అక్కడ శ్రీవారి విగ్రహానికి రోజూ పూలమాలలు వేయడం నిలిపేశారు. పద్మావతి విశ్వవిద్యాలయ వీసీగా నియమితులైన వీణా నోబుల్‌దాస్ అక్కడ వేంకటేశ్వరస్వామి ఫొటో తీసేసి జీసస్ ఫొటో పెట్టుకున్నారు. ఈ సంస్థలకు తితిదే నిధులిస్తుంది.' వైకాపా ఐదేళ్ల పాలనలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కృత్రిమ నెయ్యి లాంటి పదార్థాన్ని ఉపయోగించి వేంకటేశ్వరస్వామి పవిత్రతనే దెబ్బతీశారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో జంతుకొవ్వు కలిసిందని న్యాయస్థానంలో సిట్ దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్ 35వ పేజీలో స్పష్టంగా ఉందని వివరించారు. 'నెయ్యే కాని నెయ్యి వినియోగించడం అనేది ఒక అంశమే. దీని వెనుక శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీయాలనే పెద్ద కుట్రకోణమే ఉంది. రాజశేఖరరెడ్డి హయాం నుంచే ఇది మొదలైంది. వైకాపా పాలనలో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ నుంచి నేతల వరకు ఆ అరాచకాలను కొనసాగించారు' అని దుయ్యబట్టారు. 'సిట్ నివేదికకు అనుగుణంగా అధికారులపై - మిగతా3లో

## దోషులుగా ఎవరున్నా శిక్ష పడాల్సిందే



- నాటి తితిదే పాలకమండలిదే బాధ్యత
- వారిని వెనకేసుకొస్తే గత ప్రభుత్వ ముఖ్యుడూ బాధ్యుడే
- దేవుడి సొమ్ము దోచేసినవారి తరాలే లేచిపోతాయ్
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

అమరావతి, స్వర్ణసాగరం

గత ప్రభుత్వంలో తిరుమల లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి వాడారని అన్ని నివేదికల్లో తేలినా, అందుకు బాధ్యులను గత ప్రభుత్వ ముఖ్యుడు ఎందుకు వెనకేసుకొస్తున్నారో అర్థం కావట్లేదని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. భగవంతుడి సొమ్ముతో ఆడుకున్నా, ఆ సొమ్ము దోచుకున్నా, వారి తరాలు కూడా లేచిపోతాయని, జాగ్రత్తగా ఉండాలని - మిగతా3లో



## ధైర్యంగా ఉండండి


- సర్కారు బాధితులకు పార్టీ అండగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసా
- పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజలతో మమేకం
- అందరి సమస్యలు వింటూ.. నేనున్నానని ధైర్యం చెబుతూ..
- పేరు పేరునా పలకరిస్తూ.. కష్టసుఖాలు ఆరా తీస్తూ..
- వినతిపత్రాలు స్వీకరించి ధైర్యం చెప్పిన జననేత
- భారీగా తరలివచ్చిన యువత, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు

కడప/ అమరావతి, స్వర్ణసాగరం

మంచి రోజులు ముందున్నాయని, అందరూ ధైర్యంగా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను కలిసి కష్టాలు చెప్పుకున్న వారికి భరోసా ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వ దుర్మార్గాలతో నష్టపోయిన వారికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. వైఎస్ జగన్ రాకతో వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల కోలాహలంగా మారింది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు పులివెందులకు చేరుకున్న ఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. నేరుగా తన క్యాంపు కార్యాలయానికి విచ్చేసి మూడు గంటలకు పైగా ప్రజలతో మమేకమై మాట్లాడారు. క్యాంపు కార్యాలయంలో ఆయన - మిగతా3లో

## ఆగని కల్తీ పాల మరణాలు

- గణేష్‌ను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు
- కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆరేళ్ల బాలుడి మృతి
- ఆరుకు చేరిన మరణాలు
- పెరుగుతున్న కేసులు.. ఆస్పత్రిలో చేరిన మరో మహిళ.. 21కి చేరిన బాధితుల సంఖ్య
- చికిత్స పొందుతున్న 15 మందిలో ఏడుగురి పరిస్థితి విషమం..
- వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్న వైద్యులు



అమరావతి, స్వర్ణసాగరం

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీ పాలకూట విష ప్రభావం రోజు రోజుకూ మరింతగా పెరుగుతోంది. తాజాగా స్వరూప్ నగర్‌కు చెందిన చిన్నారి డి.మనోహర్ (6) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అ బాలుడిని మూత్రపిండాల సమస్యతో తొలుత రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడి నుంచి ఆదివారం మధ్యాహ్నం విశాఖకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మనోహర్ కిడ్నీ ఫెయిలైందని వెల్లడించారు. డయాలసిస్ చేశారు. కల్తీ పాలు తాగడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆ బాలుడి కుటుంబ సభ్యులకు చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ మనోహర్ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రస్తుతం అక్కడి మార్చురీలోనే ఉంచారు. ఇప్పటికే కల్తీ పాలు తాగి - మిగతా3లో



## రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా అమెరికాతో ట్రేడ్ డీల్

- యుద్ధ నిర్ణయం రాజకీయమే కానీ సైనికులది కాదని వ్యాఖ్య
- ఇండో, యూఎస్ ట్రేడ్ ఒప్పందం రైతులకు వ్యతిరేకమని ఆరోపణ
- పార్లమెంట్‌ను పక్కన పెట్టి ట్రంప్‌తో మోదీ డీల్ చేశారంటూ విమర్శ
- లోక్‌సభలో మాట్లాడనివ్వలేదని ఆవేదన

5

## కేరళ.. ఇక కేరళం

- ప్రజా సాధికారతకు కేంద్రం సేవా తీర్థ్
- జనపనార మద్దతు ధర రూ.275 పెంపు
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

2



# కేరళ.. ఇక కేరళం

స్వర్ణసాగరం ఢిల్లీ

దేవుడి సొంత భూమిగా పిలిచే కేరళ పేరును 'కేరళం'గా మార్చేదిశగా కీలక అడుగుపడింది. సుదీర్ఘకాలం పెండింగులో ఉన్న ఈ ప్రతిపాదనకు మంగళవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి కార్యాలయం కొత్త భవనం 'సేవాతీర్థ్'లో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన తొలి క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేముందు రాష్ట్రపతి కేరళ శాసనసభ అభిప్రాయాన్ని తీసుకుంటారు. తర్వాత బిల్లును కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెడుతుంది. ఆమోదానికి సాధారణ ఆధిక్యం సరిపోతుంది. రాష్ట్రపతి ఆమోదముద్రతో అధికారికంగా పేరు మారుతుంది. పేరు మార్పుపై కేంద్రాన్ని అభ్యర్థిస్తూ ఇప్పటికే కేరళ అసెంబ్లీ పలుమార్లు తీర్మానాలు చేసింది. ఏప్రిల్‌లో కేరళ శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి.

**అది అధికారాన్ని ప్రదర్శించే స్థానం కాదు**

సేవాతీర్థ్ భవనమంటే దేశంలో ప్రతిఒక్క పౌరుడి సాధికారతకు కేంద్రమని, అధికారాన్ని ప్రదర్శించే స్థానం మాత్రం కాదని క్యాబినెట్ పేర్కొంది. ఈ మేరకు ప్రత్యేకంగా 'సేవా సంకల్ప్ తీర్మానా'న్ని ఆమోదించింది. ఈ ప్రాంగణంలో తీసుకునే ప్రతిఒక్క నిర్ణయానికి.. 'నాగరిక్ దేవో భవ' (పౌరులే దేవుళ్లు) అనే నమ్మిక స్ఫూర్తినిస్తుందని పేర్కొంది. భారత వృద్ధి ప్రస్థానానికి ఇది సరికొత్త ఆరంభమని, 140 కోట్ల మంది భారతీయుల కోసం దేశాన్ని సరికొత్తగా పునర్నిర్మించే సంకల్పానికిది ప్రేరణనిస్తుందని క్యాబినెట్ ఉద్ఘాటించింది. ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా, పారదర్శకంగా, వివేకంగా పాలనను బలోపేతం చేయాలనేదే ప్రభుత్వ దార్శనికత అని పేర్కొంది. దశాబ్దాలుగా సౌత్‌బ్లాక్ కేంద్రంగా కొనసాగిన ప్రధానమంత్రి కార్యాలయం ఇకపై దేశీయ ఆలోచనలు, ఆధునిక భావాలు, అపరిమిత సామర్థ్యాలతో, ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి అనే భావనను పెంచేలా సేవలందిస్తుందని తెలిపింది. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని తీర్చిదిద్దడానికి, 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి క్యాబినెట్ అంకితభావంతో పనిచేస్తుందని వెల్లడించింది. ముడి జనపనార కనీస మద్దతుధరను గత సీజన్ కంటే రూ.275 పెంచి క్వింటాలుకు రూ.5,925 చొప్పున చెల్లించడానికి ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఈఏ) ఆమోదించింది. టెర్మినల్ భవనం విస్తరణ సహా కశ్మీర్‌లోని శ్రీనగర్ విమానాశ్రయంలో రూ.1,677 కోట్లతో అదనపు పనులు చేపట్టడానికి కూడా సీసీఈఏ ఆమోదించింది. గుజరాత్ మెట్రోను గిఫ్ట్‌సిటీ నుంచి షాపుర్ వరకు పొడిగించడానికి, నాలుగు (బిహార్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్) రాష్ట్రాల్లో రూ.9,072 కోట్లతో మూడు రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదించింది.



**ఎన్నికల దృష్టితో కాదు: వైష్ణవ్**

కేరళ పేరు మార్పునకు, ఆ రాష్ట్ర ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరుల సమావేశంలో స్పష్టంచేశారు. ఎన్నికల దృష్టితో కాకుండా క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంటూ వస్తోందని చెప్పారు. ఏ ఎన్నికలూ లేని సమయంలో కేరళలో కొత్త రైలు నడవాలు, వందేభారత్‌లపై నిర్ణయాలు జరిగాయని గుర్తుచేశారు. దేశ ప్రయోజనాల దృష్టితోనే అన్నీ ఉంటాయని చెప్పారు.

**కేరళవాసులను ఆంగ్లంలో ఏమనాలో?: శశిథరూర్**

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆంగ్లంలో కేరళవాసులను ఇకపై ఏమని పిలవాలని ప్రశ్నించారు. వారిని 'కేరళమైట్' అని పిలిస్తే.. అదొక సూక్ష్మజీవి పేరులా ఉంటుందని, 'కేరళమియన్'గా పేర్కొంటే ఆ పిలుపు అరుదైన ఖనిజంలా ఉంటుందని ఎద్దేవా చేశారు. ఈ సమస్య పరిష్కారానికి కొత్త పదాల కోసం కేరళ ముఖ్యమంత్రి ఓ పోటీని నిర్వహించాలను కుంటున్నారేమో అంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు.

# రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా అమెరికాతో ట్రేడ్ డీల్

యుద్ధ నిర్ణయాల నుంచి అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వరకు అన్ని అంశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశ భద్రత, రైతుల ప్రయోజనాలు, పార్లమెంటరీ వ్యవస్థ అన్నీ ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా జరిగిన రైతు మహాచౌపాల్ సభలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు.

**ప్రధాని స్పందించలేదు: రాహుల్**

మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే తన పుస్తకంలోని చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన రాహుల్, చైనా ట్యాంకులు సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు ఆదేశాల కోసం రక్షణ మంత్రికి ఫోన్ చేసినా స్పందన రాలేదని నరవణే రాశారని చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఎవరూ స్పందించలేదని ఆయన పేర్కొన్నారని తెలిపారు. చివరికి యుద్ధ నిర్ణయం ప్రధాని తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రధాని స్పందించలేదని, ఆర్మీ చీఫ్‌ను ఒంటరిగా వదిలేశారని రాహుల్ వ్యాఖ్యానించారు. యుద్ధం చేయాలా వద్దా అన్నది రాజకీయ నిర్ణయమని, అది సైన్యానికి మోపలేమని స్పష్టం చేశారు.

**వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా అమెరికాతో ఒప్పందం!**

ఇక ఇండో-- యూఎస్ ట్రేడ్ ఒప్పందంపై కూడా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికాతో కుదిరిన ఈ ఒప్పందం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా ఉందని చెప్పారు. ఐదు నెలల పాటు



వ్యవసాయ ఉత్పత్తుల అంశం కారణంగా ఈ ఒప్పందం నిలిచిపోయిందని, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రభుత్వం కూడా అంగీకరించలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ నుంచి బయటకు వెళ్లి నేరుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్?కు ఫోన్ చేసి ఒప్పందానికి సిద్ధమని చెప్పారని ఆరోపించారు.

**ఎప్‌స్టీన్ ఫైళ్ల వెనుక అనుమానాలు**

"నాలుగు నెలలు ఏమీ జరగలేదు. ఒక్కసారిగా ప్రధాని కాల్ చేసి రైతులను అమ్మేశారు. గార్మెంట్ రంగాన్ని కూడా నష్టపరిచారు. దేశ డేటాను అమెరికాకు అప్పగించారు" అంటూ విమర్శించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రధానికి సవాల్ విసిరారు. అమెరికాలో ఎప్?స్టీన్? కేసుకు సంబంధించిన లక్షల ఫైళ్లు ఉన్నాయని, అవి వెలుగులోకి రాకపోవడం వెనుక కూడా అనేక అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా అదానీ పేరే వినిపిస్తోందని, ఆ సంస్థ కేవలం కంపెనీ కాదని, బీజేపీ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా మారిందని ఆరోపించారు. "అమెరికా సుప్రీం కోర్టు నిర్ణయం తర్వాత ఇతర దేశాలు యూఎస్?తో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని నిర్ణయించు కున్నాయి. కానీ ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ఈ వేదిక నుంచి నేను మోదీని సవాలు చేస్తున్నా. అమెరికా సుప్రీంకోర్టు ఈ ఒప్పందంపై తీర్పు ఇచ్చిన తర్వాత, అమెరికాతో ఒప్పందాన్ని రద్దు చేయండి. ట్రంప్ ఒత్తిడి కారణంగా ఆయన ఒప్పందాన్ని రద్దు చేయలేరు. భారత్?లో అత్యధిక జనాభా, అత్యధిక డేటా ఉంది. కానీ ప్రధాని మోదీ మన డేటా మొత్తాన్ని అమెరికాకు ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీపై ఒత్తిడి లేకపోతే, ఆయన ఇలా చేసి ఉండేవారు కాదు. తన ఇమేజ్‌ను, రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి ఆయన భారతదేశాన్ని అమ్మేశారు" అని రాహుల్ ఆరోపించారు.

**ప్రజలతో కలిసి పోరాటం**

పార్లమెంటరీ వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది తొలిసారి లోక్‌సభ ప్రతిపక్ష నేతకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని తెలిపారు. లోక్‌సభ లో ప్రసంగం ప్రారంభించగానే అడ్డుకున్నారని, తన మాట వినిపించనివ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలు, జాతీయ భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థ అంశాల్లో కేంద్రం బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలు ముందుకు రావొద్దని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రజలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

# చైనా జే-20కి చెక్

భారత వాయుసేన (ఐఏఎఫ్) తన సామర్థ్యాన్ని మరింత పటిష్టం చేసుకునే దిశగా కీలక యోచనలు చేస్తోంది. ఇటీవలే జరిగిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత, రష్యాకు చెందిన ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ 'సుఖోయ్ ఎస్‌యూ-57' కొనుగోలుపై రక్షణ వర్గాల్లో చర్చలు మళ్లీ ఊపందుకున్నాయి. చైనా, పాకిస్థాన్ నుంచి ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ అత్యాధునిక యుద్ధ విమానాలను సమకూర్చుకోవాలని భారత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే, వాయుసేన సుమారు 40 ఎస్‌యూ-57 జెట్లను ఆర్డర్ చేసే అవకాశం ఉందని సమాచారం. గత ఏడాది పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ వాయుసేనతో జరిగిన గగనతల పోరాటాలు భారత రక్షణ వ్యూహకర్తలకు కొత్త పాఠాలు నేర్పాయి. ఆధునిక యుద్ధ తంత్రంలో ఫైటర్ జెట్లు నేరుగా తలపడే డాగ్‌ఫైట్ కన్నా, శత్రువు కంటపడకుండా దాడి చేసే స్టెల్త్ టెక్నాలజీకే ప్రాధాన్యత పెరిగిందని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో, రాడార్లకు చిక్కని ఐదో తరం యుద్ధ విమానాల ఆవశ్యకతను ఐఏఎఫ్ గుర్తించింది.



ఇప్పటికే చైనా జే-20 పేరుతో సొంతంగా స్టెల్త్ ఫైటర్‌ను అభివృద్ధి చేసింది. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ పాకిస్థాన్‌కు కూడా అందే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో, భారత్ వేగంగా స్పందించాల్సిన అవసరం ఏర్పడింది.

**ఎస్‌యూ-57 ప్రత్యేకతలు ఏంటి?**

రష్యా అభివృద్ధి చేసిన ఎస్‌యూ-57 ఒక శక్తివంతమైన ఐదో తరం మల్టీరోల్ స్టెల్త్ ఫైటర్. శత్రు రాడార్లను ఏమార్చేలా ప్రత్యేకమైన ఎయిర్‌ఫ్రేమ్ డిజైన్, రాడార్ తరంగాలను శోషించుకునే మెటీరియల్స్‌తో దీనిని నిర్మించారు. సూపర్‌క్రూయిజ్ సామర్థ్యం (ఆఫ్టర్‌బర్నర్ అవసరం లేకుండానే సూపర్‌సానిక్ వేగంతో ప్రయాణించడం), అడ్వాన్స్‌డ్ సెన్సార్ ఫ్యూజన్ వంటి అత్యాధునిక ఫీచర్లు ఇందులో ఉన్నాయి. గగనతలం నుంచి గగనతలానికి, భూమిపైకి క్షిపణులను ప్రయోగించే సత్తా దీని సొంతం.

**మధ్యంతర పరిష్కారంగానే..**

భారత్ సొంతంగా 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్' (ఏఎంసీఏ) పేరుతో ఐదో తరం ఫైటర్ జెట్‌ను అభివృద్ధి చేస్తోంది. అయితే దీని తొలి ప్రయోగాత్మక ఫ్లైట్ 2028-29లో జరిగి, 2035 నాటికి గానీ వాయుసేనలోకి పూర్తిస్థాయిలో చేరే అవకాశం లేదు. ఈ సుదీర్ఘ కాలంలో ఏర్పడే వ్యూహాత్మక అంతరాన్ని పూడ్చడానికే ఎస్‌యూ-57 జెట్లను ఒక 'బ్రిడ్జింగ్' పరిష్కారంగా భారత్ చూస్తోంది. గత ఏడాది జరిగిన ఏరో ఇండియా 2025లో రష్యా ఈ విమానాన్ని ప్రదర్శనకు ఉంచింది. అయితే, ప్రస్తుతానికి ఈ కొనుగోలుపై ఎలాంటి అధికారిక ఒప్పందం జరగలేదని, కేవలం చర్చల దశలోనే ఉందని రక్షణ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

## నేటి నుంచి మోదీ ఇజ్రాయెల్ పర్యటన

స్వర్ణసాగరం ఢిల్లీ

ద్వైపాక్షిక రక్షణ, వాణిజ్య సహకారాన్ని పెంపొందించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం నుంచి రెండు రోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. అమెరికా, ఇరాన్‌ల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించడంతోపాటు పశ్చిమాసియాలో ఇతరత్రా ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న దశలో ప్రధాని పర్యటన సాగనుంది. ఇజ్రాయెల్ పార్లమెంటులో మోదీ ప్రసంగించనున్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో అనేక అంశాలపై సంప్రదింపులు జరపడంతోపాటు ఆ దేశ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌తో సమావేశం కానున్నారు. రక్షణ, భద్రత రంగాల్లో సహకారంపై ప్రధానమంత్రుల ప్రతినిధి బృందాలు విస్తృతంగా చర్చించనున్నాయి. నెతన్యాహు బుధవారం రాత్రి ఏర్పాటు చేయనున్న వ్యక్తిగత విందులో మోదీ పాల్గొంటారు. గడచిన తొమ్మిదేళ్లలో మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించడం ఇది రెండోసారి. చివరిసారిగా ఆయన 2017 జులైలో ఆ దేశాన్ని సందర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాని సైతం 2018 జనవరిలో భారత పర్యటనకు విచ్చేశారు. తాజా పర్యటనలో భాగంగా ఇరువురు ప్రధానులూ గాజా పరిస్థితితో పాటు పశ్చిమాసియాకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించనున్నారు. 41 వేల మంది ప్రవాస భారతీయులు ఇజ్రాయెల్‌లో ఉన్నారు. వారితో మోదీ సంభాషించే అవకాశం ఉంది.

## బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

స్వర్ణసాగరం న్యూఢిల్లీ

మహిళల్లో పెరుగుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్‌ను దేశవ్యాప్తంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 14 ఏళ్ల వయసున్న బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాను అందించే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనుందని ఆరోగ్యశాఖ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సింగిల్ షాట్ గార్డాసిల్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను అందిస్తారు. ఇది గర్భాశయ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ వైరస్‌లోని నాలుగు రకాల (6, 11, 16, 10) ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఒక వ్యాక్సిన్ డోసు తీసుకోవడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాలిక రక్షణ ఉంటుంది. జాతీయ కార్యక్రమంలో భాగంగా కేంద్రం ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించనుంది. 15 ఏళ్లలోపు వయసున్న బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న గార్డాసిల్-4 అనే వ్యాక్సిన్‌ను రెండు డోసులు అందించాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర రూ.3,927. అయితే 15 ఏళ్లు పైబడిన బాలికలు మాత్రం మూడు డోసులు తీసుకోవాలి. గార్డాసిల్-4 వ్యాక్సిన్‌ను ఎంఎ?సడీ ఇండియా అనే సంస్థ తయారు చేస్తోంది. ఈ టీకా 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్టు అంచ
-. హెచ్‌పీవీ రకాల వల్ల వ్యాపించే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడంలో ఈ టీకా 93 నుంచి 100 శాతం ప్రభావంతో పనిచేసినట్టు ఆధారాలు ఉన్నాయి.

## అమెరికా అతిపెద్ద యుద్ధనౌకలో వింత కష్టాలు

మధ్యప్రాచ్యంలో ఇరాన్‌తో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ, అమెరికా తన సైనిక శక్తిని పెద్ద ఎత్తున మోహరిస్తోంది. అయితే, ఈ కీలక సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత ఖరీదైన విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఊహించని సమస్యలతో సతమతమవుతోంది. యుద్ధ సన్నాహాల కంటే ఎక్కువగా.. నౌకలోని మరుగుదొడ్ల వ్యవస్థ విఫలమవడం సుమారు 5,000 మంది సిబ్బందికి నరకం చూపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో, మధ్యప్రాచ్యంలో సైనిక శక్తిని ప్రదర్శించేందుకు ఈ నౌకను రంగంలోకి దించారు. గత ఏడాది జూన్‌లో సముద్రంలోకి వచ్చిన ఈ నౌక మోహరింపును ఇప్పటికే రెండుసార్లు పొడిగించారు. దీంతో సిబ్బంది దాదాపు 8 నెలలుగా సముద్రంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణంగా శాంతికాలంలో ఆరు నెలలకు మించి డెప్లాయ్‌మెంట్ (మోహరింపు) ఉండదు. ఇది మరో 11 నెలల వరకు కొనసాగితే, అమెరికా నేవీ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన నిరంతర డెప్లాయ్‌మెంట్‌గా రికార్డు సృష్టిస్తుందని రిటైర్డ్ రియర్ అడ్మిరల్ మార్క్ మాంట్‌గోమరీ వాల్ స్ట్రీట్ జర్నల్‌కు తెలిపారు. సుమారు 13 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.1 లక్షల కోట్లు) భారీ వ్యయంతో నిర్మించిన ఈ నౌకలో ఏర్పాటు చేసిన వాక్యూమ్ ఆధారిత ప్లంబింగ్ వ్యవస్థే ప్రధాన సమస్యగా మారింది. ఇందులో దాదాపు 650 టాయిలెట్లు ఉన్నాయి. ఏదైనా ఒక టాయిలెట్‌లో సమస్య వస్తే, ఆ సెక్షన్‌లోని అన్ని టాయిలెట్లు పనిచేయకుండా పోతున్నాయి. టీ-షర్టులు, తాళ్లు వంటి వస్తువులు పైపుల్లో ఇరుక్కుపోవడం, కొన్నిసార్లు టాయిలెట్ విడిభాగాలు ఊడిపోవడం వంటి కారణాలతో ఈ వ్యవస్థ తరచూ మొరాయిస్తోంది. జనవరిలో ఎన్‌పీఆర్ రిపోర్ట్ ప్రకారం, ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యాయని తెలుస్తోంది. ఈ సాంకేతిక సమస్యల పరిష్కారానికి నావికా సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. లీక్‌లను అరికట్టేందుకు కొందరు సిబ్బంది రోజుకు 19 గంటల వరకు పనిచేస్తున్నట్లు సమాచారం. డెప్లాయ్‌మెంట్ గడువును పదేపదే పొడిగించడంతో సిబ్బంది శారీరకంగా, మానసికంగా తీవ్ర అలసటకు గురవుతున్నారు. నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండటం వారిని మరింత కుంగదీస్తోంది. నౌక కదలికలను రహస్యంగా ఉంచే 'ఘోస్ట్ మోడ్' కారణంగా బయటి ప్రపంచంతో సంప్రదింపులు కూడా పరిమితమయ్యాయి. ఈ ఒత్తిడితో విసిగిపోయిన కొందరు నావికులు, ఈ డ్యూటీ ముగిసిన వెంటనే నేవీని విడిచిపెట్టాలని భావిస్తున్నట్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌తో పాటు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరడంతో రెండు విమాన వాహక నౌకలు మోహరించినట్లు అయింది.

### మారంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుటుంబానికి

## నేదురుమల్లి పరామర్శ



స్వర్ణసాగరం, వాకాడు (ఫిబ్రవరి 24) :

మండల పరిధిలోని గంగన్నపాళెం గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు మారంరెడ్డి చంద్రారెడ్డి సోదరుడు, జమీన్ కొత్తపాళెం ఉప సర్పంచ్ వైసీపీ యువ నాయకులు మారంరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి చిన్నాన్న మారంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (కస్తూరి రెడ్డి) ఇటీవల అకాలమరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు కొడవలూరు బక్తవత్సలరెడ్డి, వాటంగారి వెంకటరమయ్య, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

# ఆగని కల్తీ పాల మరణాలు

-మొదటిపేజీ తరువాయి

19 మంది అస్వస్థతకు గురవగా.. మంగళవారం మరో కేసు నమోదైంది. రాజమహేంద్రవరం నగరానికి చెందిన రెడ్డి అనంతలక్ష్మి (55) మూత్రపిండాల వ్యాధితో డెల్టా ఆస్పత్రిలో చేరారు. ఆమెను తొలుత కిమ్స్ ఆస్పత్రిలో చేర్చేందుకు సర్వం సిద్ధం చేశారు. అయితే ఆ ఆస్పత్రిలో ఇప్పటికే ఇదే కేసు బాధితులు ఎక్కువ మంది ఉండటంతో డెల్టా ఆస్పత్రికి మార్చారు. ప్రస్తుతం ఆమెకు డయాలసిస్ చేస్తున్నారు. దీంతో బాధితుల సంఖ్య 21కి చేరింది. వీరిలో ఆరుగురు ఇప్పటికే మృతి చెందగా.. మిగిలిన 15 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. రెయిన్‌బో ఆస్పత్రిలో మూడేళ్లలోపు చిన్నారులు ముగ్గురు చికిత్స పొందుతున్నారు. వారికి రోజుకు రెండుసార్లు డయాలసిస్ చేస్తున్నారు. ఈ దృశ్యాలు చూపరులను కలచివేస్తున్నాయి.

**హెల్త్ బులెటిన్ విడుదల**

కల్తీ పాల ఘటనపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మంగళవారం నివేదిక విడుదల చేసింది. లాలాచెరువు పరిధిలోని చౌడేశ్వర నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాలకు చెందిన పలువురు వృద్ధులు అనూరియా, వాంతులు, పొత్తికడుపు నొప్పి, తీవ్ర మూత్రపిండ వైఫల్యంతో ఆసుపత్రిలో చేరినట్టు గుర్తించారు. రక్తంలో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయిలు అధికంగా ఉండటంతో విషపూరిత ప్రభావం ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. పాల వినియోగమే దీనికి ప్రధాన కారణమని తేలింది. నెఫ్రాలజిస్టులతో కూడిన 14 ఫీల్డ్ సర్వేలెన్స్ బృందాలు 679 ఇళ్లను సందర్శించి 957 కుటుంబాలను స్క్రీనింగ్ చేశాయి. 110 కుటుంబాల్లో 293 మందిని గుర్తించి 315 రక్త నమూనాలు సేకరించారు. వాటిలో 313 సాధారణంగా ఉండగా ఇద్దరిలో యూరియా, క్రియాటినిన్ స్థాయిలు పెరిగినట్లు వెల్లడైంది.

**సెంట్రల్ జైలుకు పాల వ్యాపారి తరలింపు**

కల్తీ పాల వ్యాపారి అడ్డాల గణేష్ అరెస్టుపై హైడ్రామా నడిచింది. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో గణేష్ ను అరెస్టు చేసిన పోలీసులు జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలీసుల అదుపులో ఉన్న అతడికి కడుపు నొప్పి రావడంతో మంగళవారం కిమ్స్ బొల్లినేని ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం మధ్యాహ్నం అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడు కోలుకోవడంతో కోర్టులో హాజరుపర్చగా.. మార్చి 10 వరకూ రిమాండ్ విధించడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

**వీడని కల్తీ గుట్టు**

కల్తీ పాల గుట్టు ఇంకా వీడలేదు. కల్తీపై స్పష్టత రావాలంటే రక్తం, పాల నమూనాల నివేదికలు రావాల్సి ఉంది. ఇవి మంగళవారం వచ్చే అవకాశముందని అధికారులు వెల్లడించినా.. మరికొంత సమయం పట్టవచ్చని భావిస్తున్నారు. ల్యాబ్ రిపోర్టులు వస్తేగాని.. మరణాలు ఎలా సంభవించాయి.. పాలు పూర్తిస్థాయిలో కల్తీ జరిగాయా.. లేక వేరే ఏమైనా కలుషితం జరిగాయా అనే విషయం స్పష్టమవుతుంది. కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం అత్యుత్సాహంతో కూలెంట్ లీకేజీ సంభవించి 'ఇథలీన్ గ్లైకాల్' కలవడంతో పాల కల్తీ జరిగి ఈ మరణాలు సంభవించాయనే వాదన వినిపిస్తున్నారు. ల్యాబ్ రిపోర్టులు అందకుండానే దీనిపై ఎలా నిర్ధారిస్తున్నారనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా.. పాల వ్యాపారి అడ్డాల గణేష్ డెయిరీ వద్ద పాల కల్తీకి ఉపయోగించే





అనుమానిత పౌడర్ ప్యాకెట్లు లభ్యమయ్యాయి. ఆ పౌడర్ ఏమిటనేదానిపై ల్యాబ్ నివేదికలు రావాల్సి ఉంది. అప్పుడే కల్తీ గుట్టు వీడుతుంది.

**మెలమైన్ కూడా కలిసే అవకాశం**

పాలల్లో ఇథలీన్ గ్లైకాల్‌తోపాటు యూరియా, మెలమైన్ కలిసే అవకాశం ఉందని ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ రవిరాజు, విశాఖపట్నం కేజీహెచ్‌కు చెందిన డాక్టర్ గుళ్లపల్లి ప్రసాద్, డాక్టర్ సుధాకర్ వెంచురి, పి.శశాంక పాకలపాటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్తీ పాల కేసులను వీరే సమన్వయం చేస్తున్నారు. బాధితుల నుంచి సేకరించిన రక్త నమూనాలకు పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ల్యాబ్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నామని, ఫలితాలు 2 నుంచి 4 రోజుల్లో వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**63 సార్లు డయాలసిస్ చేసినా..**

రాజమహేంద్రవరంలోని స్వరూప్ నగర్‌కు చెందిన ఆరేళ్ల బాలుడు డి.మనోహర్‌కు కేజీహెచ్‌లో ఆరు రోజుల్లో ఏకంగా 63 సార్లు డయాలసిస్ చేయాల్సి వచ్చింది. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఆ బాలుడు మంగళవారం ప్రాణం వదిలాడు. ఈ నెల 18న అతడిని కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. అతడికి పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోడాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో వైద్యులు కిడ్నీ సమస్య ఉందని వైద్యులు గుర్తించి, అప్పుడే వైద్యం ప్రారంభించారు. చివరకు కిడ్నీ ఫెయిల్యూర్ కారణంగా బాలుడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

**అసలు ఊహించలేదు**

కల్తీ పాలు తాగటం వల్లే మా అబ్బాయి చనిపోయాడు. మూడేళ్లుగా గణేష్ వద్దే పాలు తీసుకుంటున్నాం. ఇంట్లో మా బాబు ఒక్కడే పాలు తాగుతున్నాడు. మహా శివరాత్రి నుంచి మా అబ్బాయికి ఆరోగ్యం బాగోలేదు. ఆ రోజు నుంచే యూరిన్ ఆగిపోయింది. రాజమండ్రి ఆస్పత్రి నుంచి కాకినాడ పంపారు. అక్కడి నుంచి 18న వైజాగ్ తీసుకొచ్చాం. మంగళవారం మధ్యాహ్నం చనిపోయాడని తెలిపారు. మనోహర్‌ను నమ్ముకునే బతుకుతున్నాం. ఇలా జరుగుతుందని ఊహించలేదు.

రెండింటి వల్ల కిడ్నీ పాడవుతుంది

పాలు కల్తీ ఎలా జరిగాయనేది ల్యాబ్ రిపోర్టులు వస్తేనే కానీ చెప్పలేం. ఫ్రిజ్ నుంచి ఇథలీన్ గ్లైకాల్ లీకై పాలలో కలిసినా కిడ్నీ సమస్యలు వస్తాయి. అలా కాకుండా పాలలో యూరియా వంటి రసాయనాలు కలిపినా కిడ్నీ ఫెయిలయ్యే అవకాశం ఉంటుంది. గణేష్ వద్ద పాలు తీసుకున్న వారంతా కిడ్నీ పనితీరును నిర్ధారించే క్రియాటినిన్ పరీక్షలు తప్పక చేయించుకోండి. తేడా వస్తే ఆలస్యం చేయకుండా వెంటనే చికిత్సలు పొందండి. -- డాక్టర్ శశాంక్, నెఫ్రాలజిస్ట్, రాజమహేంద్రవరం

**బాధ్యులపై చర్యలేవీ?**

మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం

చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో జనం చచ్చిపోతున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూస్తూ కూర్చుందని మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజమండ్రిలో కల్తీ పాలు తాగి ప్రజలు చనిపోవడానికి ప్రభుత్వ అవినీతి, పర్యవేక్షణ లేకపోవడమే ప్రధాన కారణమని అన్నారు. 'ఓ వ్యక్తిపై చర్య తీసుకుని చేతులు దులుపుకుంటారా.. బాధ్యులైన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు.

కొన్ని నెలలుగానో, అంతకు ముందు నుంచో కల్తీ జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు. జనం చచ్చిపోతుంటే పట్టించుకోకుండా, ప్రశ్నించే వారిపై మాత్రం కక్ష సాధింపు చర్యలపై మాత్రమే ఈ ప్రభుత్వం దృష్టి సారించింది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అవినీతి భారీగా పెరిగిపోయిందని, ఇదేంటని ఎవరినైనా అడిగితే పెదబాబు, చినబాబులకు ముడుపులు ఇస్తున్నామని చెబుతున్నారని చెప్పారు. 'దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఏవో తప్పులు జరిగినట్లు సభలో మాట్లాడుతున్నారు. అలా మాట్లాడటం సరికాదు. తన తండ్రిని ప్రత్యర్థులు పొట్టన పెట్టుకున్నా, ఆ బాధను దిగమింగుకుని వైఎస్సార్ పరిపాలన చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల సమయంలో ప్రధాని పర్యటనలను పట్టించుకోలేదని మాట్లాడుతున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు ప్రధాని పర్యటనలను చూడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దే కదా.. మహిళలు ఉన్నారని కూడా చూడకుండా సత్యదూరమైన మాటలను సభలో మాట్లాడుతున్నారు. సోము వీర్రాజుకు వయసొచ్చిందే గానీ దానికి తగ్గట్టు మాట్లాడటం లేదు. మేం ఏం అడిగినా ప్రభుత్వం బాధ్యతగా సమాధానం చెప్పడం లేదు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఘోరంగా క్షీణించాయి. దానికి నిరసనగా సభ నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చేశాం. సభలో ఏ అంశంపై అయినా చర్చించడానికి ఎంత సమయం అయినా ఎన్ని గంటలైనా మేం సిద్ధంగా ఉన్నాం' అని తెలిపారు.

# భక్తుల సేవకే పెద్దపీట

-మొదటిపేజీ తరువాయి

చర్యలు తీసుకున్నాక ప్రభుత్వం మౌనంగా ఉంది. అయితే తప్పు చేసిన వైకాపా నేతలు.. మమ్మల్నే క్షమాపణ చెప్పాలంటున్నారు. నీతి, నిజాయతీ కలిగిన మమ్మల్ని దోషులుగా చూపాలని తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారు. నాలుగు రోజులు శాసనమండలిలో గొడవ చేశారు. రాజమహేంద్రవరం కల్తీ పాల ఘటనపైనా చర్చించకుండా అడ్డుపడ్డారు' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో మంగళవారం కల్తీ నెయ్యి వ్యవహారంపై లఘుచర్చలో చంద్రబాబు మాట్లాడారు. దీనిపై సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చారు. 'చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకు నాటకాలు ఆపండి, పవిత్రత కాపాడండి. దేవాలయాల జోలికి రావద్దు.. హిందువుల మనోభావాలు దెబ్బతీయొద్దు' అని వైకాపా నేతల్ని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం 94% స్ట్రైక్‌రేట్‌తో గెలిచి అధికారంలోకి వచ్చిందంటే దానికి వేంకటేశ్వరస్వామి కృపే కారణమని చంద్రబాబు స్పష్టం చేశారు. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

**హిందూ ధర్మాన్ని హేళన చేశారు**

2019-24 మధ్య వైకాపా నేతలు ఎన్నో కుట్రలు చేశారు. రాష్ట్రంలో 2,032 దేవాలయాలపై దాడులు జరిగాయి. 32 విగ్రహాలను అపవిత్రం చేశారు. 59 విగ్రహాలు చోరీ అయ్యాయి. అయినా కేసులు నమోదుచేయలేదు. పిచ్చివాళ్ల చేష్టలు, వీధికుక్కలు చేశాయి, గుప్తనిధుల వేట అని తేలిగ్గా తీసుకున్నారు. విగ్రహమే కదా.. ఏముంది అంటూ చులకనగా మాట్లాడారు.

వైకాపా హయాంలో తిరుమల-తిరుపతి బస్సు టికెట్లపై 'తక్కువ ఖర్చు, అన్ని సౌకర్యాలతో క్రైస్తవులకు పవిత్ర జెరూసలెం యాత్ర' అని ముద్రించి అన్యమత ప్రచారానికి పాల్పడ్డారు.

2018లో పింక్ డైమండ్ చోరీ అయిందని, అది మా ఇంట్లో ఉందని ప్రచారం చేశారు. అప్పుడే వారిని పట్టుకొచ్చి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు. కానీ మేం ప్రజాస్వామ్యయుతంగా వెళ్లాలని రూ.100 కోట్లకు పరువునష్టం దావా వేశాం. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఆ కేసు విత్‌డ్రా చేసుకున్నారు. మళ్లీ మేం వ్యక్తిగతంగా ఇంప్లీడ్ అయి పోరాడుతున్నాం.

తితిదే బోర్డును రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు. వైకాపా హయాంలో 2021లో 50 మంది ప్రత్యేక ఆహ్వానితుల్ని నియమించారు. మొత్తం 85 మందితో జంబో బోర్డు ఏర్పాటుచేశారు. హైకోర్టు ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టింది. (నేనే ఫైట్ చేశాను అని సభాపతి స్థానంలో ఉన్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు చెప్పగా.. చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు)

పవిత్రమైన పరకామణిలో చోరీ జరిగితే లోక్‌అదాలత్‌కు పంపి రాజీ చేశారు. చాలా చిన్న నేరమని.. తీసుకున్నదాని కంటే ఎక్కువ మొత్తం, తన సొంత సొమ్మును శ్రీవారికి దానం చేశారని జగన్ చులకనగా మాట్లాడారు.

ఇందాపూర్, హెరిటేజ్ మధ్య.. నెయ్యి సంబంధమే లేదు

హెరిటేజ్ రోజూ 20 లక్షల లీటర్ల పాలు సేకరిస్తుంది. ప్రభుత్వ కార్యక్రమాలైనా, దేవాలయాలైనా హెరిటేజ్ నుంచి ఉత్పత్తులు సరఫరా చేయడానికి వీల్లేదని గతంలో నిర్ణయించుకున్నాం. అదే అమలుచేస్తున్నాం.

ఇందాపూర్ డెయిరీ దేశంలో వివిధ సంస్థలకు ఉత్పత్తులు తయారుచేసి ఇస్తుంది. మదర్ డెయిరీ, బ్రిటానియా, హిందూస్థాన్ యునిలీవర్, ఆయుర్వేద ఘీ, పతంజలి, డీమార్ట్, రిలయన్స్, దొడ్ల, హేట్సన్, టాటా, జీఆర్‌బీ, అమూల్, హెరిటేజ్ తదితర సంస్థలు ఇందులో ఉన్నాయి.

హెరిటేజ్‌కు చీజ్, యూహెచ్‌టీ, ఎస్ఎన్‌పీ ఉత్పత్తులు మాత్రమే ఇందాపూర్ డెయిరీ తయారు చేస్తోంది. నెయ్యితో సంబంధం లేదు. కానీ తిరుమల నెయ్యికి హెరిటేజ్‌కు ముడిపెట్టి వైకాపా దుష్ప్రచారం చేస్తోంది.

తిరుమలలో ప్రక్షాళన మొదలుపెట్టాం

కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుమలలో లడ్డూ, ఆహారపదార్థాల తయారీకి ఎఫ్ఎస్ఎస్ఏఐ ధ్రువీకరించిన ఉత్పత్తులు సేకరిస్తున్నాం. నాణ్యత దెబ్బతినకుండా చూస్తున్నాం. ఇందుకు ఏఐని కూడా ఉపయోగిస్తున్నాం.

అన్నప్రసాదం తయారీలో పాతదిట్టం వ్యవస్థను తిరిగి అమల్లోకి తెస్తున్నాం. నాణ్యత, రుచిపై ప్రత్యేకదృష్టి పెట్టాం. దీనిపై భక్తులూ సంతోషంగా ఉన్నారు

క్యూలైన్ల సమీపంలో 24 గంటలూ భక్తులకు పాలు అందిస్తున్నాం. అదనంగా 23 ఆహార కౌంటర్లు ఏర్పాటుచేశాం. ఆధునిక వసతులతో వంటశాల అందుబాటులోకి తెచ్చాం.

బ్రేక్ దర్శనాల నియంత్రణతో సాధారణ భక్తులకు దర్శన సమయం పెంచాం. ప్రతి 25 మంది పోటు కార్మికులకు ఒక సూపర్‌వైజర్ చొప్పున పోస్టులు మంజూరు చేస్తున్నాం.

ఏ కష్టమొచ్చినా వెంకన్నకే చెప్పుకొంటా

48 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా. 2028 నాటికి 50 ఏళ్లు అవుతుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి మా కులదైవం. నాకు ఏ కష్టం ఉన్నా ఆయనకు చెప్పి ముందుకు సాగుతా. మంచి మనసివ్వాలని, మంచి పని చేసేలా ఆశీర్వదించాలని రోజూ 2 నిమిషాలు స్వామివారి పటం ముందు ప్రార్థిస్తా.

**పాదరక్షలు విడిచి ప్రసంగించిన చంద్రబాబు**

కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో మాట్లాడే ముందు సీఎం చంద్రబాబు పాదరక్షలు విడిచారు. తర్వాతే ప్రజంటేషన్‌పై మాట్లాడారు. ప్రసంగం పూర్తయ్యాక మళ్లీ పాదరక్షలు ధరించారు.

# దోషులుగా ఎవరున్నా శిక్ష పడాల్సిందే

-మొదటిపేజీ తరువాయి

హెచ్చరించారు. ఇప్పటికైనా కల్తీని ఒప్పుకోవాలని, అలాకాకుండా దిల్లీ వెళ్లి కోర్టుల్లో కేసులు వేసేకొద్దీ మీ పాపం పెరిగి నాశనం త్వరగా వస్తుందే తప్ప, తగ్గదని వ్యాఖ్యానించారు. శాసనసభలో మంగళవారం కల్తీనెయ్యిపై లఘుచర్చలో పవన్‌కల్యాణ్ మాట్లాడారు. "గత ప్రభుత్వ హయాంలో తితిదేలో 68 లక్షల కేజీల కల్తీనెయ్యి వాడారు. అందులో పందికొవ్వు ఉందని ఎన్‌డీడీబీ నివేదికలో వచ్చింది. సీబీఐ సిట్ కూడా రసాయనాలు, పామాయిల్‌తో నెయ్యి లేకుండా నెయ్యి తయారుచేశారని పేర్కొంది. అలాంటప్పుడు ఆ ముఖ్యనేత.. 'నాకు సంబంధం లేదు, తితిదే బోర్డు అంతా చేసింది. దానిపై కమిటీ వేసి, నిష్పాక్షికంగా విచారణ జరిపి, శిక్షపడేలా చేయండి' అని సింపుల్‌గా తేల్చేయవచ్చు. కానీ సిట్ నివేదిక వచ్చాక కూడా కల్తీ లేదంటున్నార'ని మండిపడ్డారు. దీనికి నాటి తితిదే పాలకమండలితో పాటు గత ప్రభుత్వాన్ని నడిపిన వ్యక్తి కూడా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. దోషులుగా ఎవరున్నా శిక్ష పడాల్సిందేనని స్పష్టంచేశారు. పవన్‌కల్యాణ్ ఇంకా ఏమన్నారంటే..

**కుట్రలో భాగమే.. నిబంధనల సడలింపు**

నెయ్యి సరఫరాదారులైన భోలేబాబా, మాల్‌గంగా, వైష్ణవీ డెయిరీలు ఒక్క లీటర్ పాలు కూడా లేకుండా పామాయిల్‌లో రసాయనాలు కలిపి నెయ్యి తయారు చేసినట్లు సిట్ చెప్పింది. ఆ రసాయనాల్లో ఏమున్నాయో పెరుమాళ్లకు ఎరుక. 36 మందిని నిందితులుగా సిట్ తేల్చింది. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు ప్రణాళిక ప్రకారం కుట్ర జరిగింది. నెయ్యి సరఫరా టెండర్లు వారికి నచ్చిన సంస్థలకు దక్కేలా నాటి తితిదే పెద్దలు ప్రణాళిక వేశారు. నిబంధనలన్నీ సడలించారు. 2019-24 మధ్య 11 కోట్ల మంది శ్రీవారిని దర్శించుకోగా, 48 కోట్ల లడ్డూలు



అందించారు. వాటిలో 20 కోట్ల లడ్డూలు నకిలీనెయ్యితో తయారైనవేనని తితిదే రికార్డులు చెబుతున్నాయి.

**ముఖ్యవ్యక్తే చేశారని అనలేదే!**

నేనెక్కడా గత ప్రభుత్వాన్ని నడిపిన ముఖ్యవ్యక్తే ఇదంతా చేశారనలేదు. ఆ ప్రభుత్వం నియమించిన తితిదే పాలకమండలిది బాధ్యత అని చెప్పాను. వాళ్లను ఎందుకు వెనకేసుకొస్తున్నారో అర్థం కావడంలేదు.

**పశ్చాత్తాపంతో దీక్ష చేశా**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఎన్డీఏ సమావేశంలో చంద్రబాబు ఎన్‌డీడీబీ నివేదికను చదివారు. నెయ్యిలో పందికొవ్వు కలిసినట్లు నివేదిక వచ్చిందన్నారు. దానిపై మీరెవరూ మాట్లాడరా అంటూ చాలామంది నన్ను ట్యాగ్ చేస్తూ మెసేజ్‌లు చేశారు. మరునాడు 'సనాతన ధర్మరక్షణ బోర్డు లాంటిది ఉంటే బాగుంటుంది' అని ట్వీట్ చేశాను. ప్రజాజీవితంలో ఉన్నందున ఒకరిని నిందించాలంటే చాలా ఆలోచించాను. గతంలో తిరుమలకు వెళ్లినప్పుడు ప్రసాదంలో నాణ్యతలేమిపై భక్తులు నాతో పంచుకున్న విషయాలు గుర్తుకొచ్చాయి. పశ్చాత్తాపంతో దీక్ష చేశాను" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

**రాయలవారు ఆనాడే హెచ్చరించారు**

'రాజు కోసం డబ్బు వసూలు చేసేవాడికి దేవాలయంపై అధికారమివ్వకు. అలాంటివాడు వసూళ్లలో నష్టం వచ్చినప్పుడల్లా, దేవుడి ధనాన్ని రాజు ఖజానాకు చేరుస్తాడు. అది తప్పుడు పని. అందుకే ఎలాంటి మమకారాలు లేని ఒంటరివాడే ఆలయ అధికారిగా ఉండాలి. వాడు దేవుడి సొత్తు తింటే, ఆ పాపానికి వాడే పోతాడు. కానీ, వాడు ఆ సొమ్ము తెచ్చి రాజుకు ఇవ్వడం వల్ల ఆ రాజ్యమే నాశనమవుతుందని శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలోని 218వ పద్యంలో రాశారు. దేవుడి సేవలో ఎలాంటివారిని నియమించాలో రాజుకు కర్తవ్యబోధ చేశారు' అంటూ..

## ధైర్యంగా ఉండండి



-మొదటిపేజీ తరువాయి

అభిమానులు, పార్టీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలను కలుసుకున్నారు. కార్యకర్తల కష్టసుఖాలు ఆరా తీస్తూ.. టీడీపీ నేతల అరాచకాలతో ఇబ్బందులు పడిన బాధితుల కష్టాన్ని వింటూ.. నేనున్నానని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. తర్వాత ఇంటి వద్ద వేచి ఉన్న నాయకులతోనూ చర్చించారు. క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, సమస్యల పరిష్కారం కోసం వచ్చిన బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. ప్రతి ఒక్క కార్యకర్తను పేరు పేరునా పలకరించడమే కాక ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కొంత మంది యువకులు జగన్‌ను దగ్గరి నుంచి చూడాలని, ఆయనతో కరచాలనం చేయాలని అభిమానంతో ముందుకు రాగా, వారి కోరిక మేరకు సెల్ఫీలు దిగుతూ వారితో మాట్లాడారు.

**కార్యాలయం వద్ద జన సందోహం**

వైఎస్ జగన్ పులివెందులకు వస్తున్నారని తెలుసుకున్న ప్రజలు భారీగా తరలివచ్చారు. వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం ఆవరణమంతా జన సంద్రంగా మారింది. పార్టీ అభిమానులు, కేడర్‌తోపాటు యువత, దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు ఇలా అందరూ తరలి రావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసింది. యువకులు వైఎస్ జగన్ నినాదాలతో హోరెత్తించారు. వైఎస్ జగన్ వాహనంపై నుంచి అందరికీ అభివాదం చేస్తూ.. కరచాలనం చేస్తూ.. సెల్ఫీలు దిగుతూ ముందుకు కదిలారు. కాగా, పార్టీనేతలు తదితరులు వైఎస్ జగన్‌ను కలిశారు.

swarna sagaram_Swarna sagaram.qxd 2/24/2026 11:15 PM Page 1




తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# ఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీ సీఈఓకు సి ఎస్ ఆర్ లీడర్‌షిప్ అవార్డు

## సిఎస్ఆర్ సమ్మిట్ లో కీలక ఉపన్యాసం ఇస్తున్న సీఈఓ జన్మే జయ మహా పాత్ర






ముత్తుకూరు.. స్వర్ణ సాగరం

భారతదేశంలో ప్రముఖ స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థలలో ఒకటైన ఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంస్థ సీఈఓ జన్మేజయ మహాపాత్రకు ప్రతిష్టాత్మక జాతీయ గుర్తింపు లభించింది. టైమ్స్ ఫౌండేషన్ మరియు టైమ్స్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన నేషనల్ సి ఎస్ ఆర్ సమ్మిట్ 2026లో ఆయనకు 'డిస్టింగ్విష్డ్ లీడర్‌షిప్ అవార్డు' అందజేశారు. సమాజ ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో ఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీ అమలు చేస్తున్న ప్రభావవంతమైన కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలకు గాను ఈ అవార్డును ప్రదానం చేశారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ రాష్ట్ర మంత్రి అనుప్రియా పటేల్ చేతుల మీదుగా, భారతీయ సి సి ఎస్ ఆర్ రంగ ప్రముఖుడు భాస్కర్ ఛటర్జీ (ఐఏఎస్--విరమణ) సమక్షంలో ఈ పురస్కారం అందజేయడం విశేషం. ఈ సందర్భంగా సీఈఓ జన్మేజయ మహాపాత్ర మాట్లాడుతూ, "ఈ అవార్డు మా బృందం చేసిన నిరంతర కృషికి, సమాజ ఆరోగ్యాభివృద్ధి పట్ల మా నిబద్ధతకు నిదర్శనం. ఆరోగ్యవంతమైన, స్థిరమైన భవిష్యత్తు నిర్మాణం దిశగా మా ప్రయత్నాలను మరింత బలపరుస్తాం" అని అన్నారు. గత పదేళ్లలో ఎస్.ఈ.ఐ.ఎల్. ఎనర్జీ ఇండియా లిమిటెడ్ అమలు చేసిన సి ఎస్ ఆర్ కార్యక్రమాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో 10 లక్షలకుపైగా ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు చోటు చేసుకున్నట్లు సంస్థ వర్గాలు తెలిపాయి. పరిశ్రమల నాయకులు ఉత్తమ పద్ధతులు, వినూత్న ఆవిష్కరణలను పంచుకునే వేదికగా నేషనల్ సమ్మిట్ నిలుస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ముత్తుకూరులో మెగా మల్టీ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్







ముత్తుకూరు. స్వర్ణ సాగరం

అదానీ ఫౌండేషన్, అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ముత్తుకూరులో మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో నెల్లూరు అపోలో హాస్పిటల్స్ కు చెందిన చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ సూర్య, కార్డియాలజీ వైద్యుడు డాక్టర్ విద్యాశరణ్ రెడ్డి, అదానీ ఫౌండేషన్ వైద్యుడు డాక్టర్ సిహెచ్. సుహర్షన్ రెడ్డి సేవలందించారు. అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ జగదీష్ పటేల్ మార్గదర్శకత్వంలో శిబిరం సజావుగా నిర్వహించబడింది. వైద్యులు రోగులను పరిశీలించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పేద ప్రజలకు వారి ఇంటి వద్దనే నాణ్యమైన వైద్య ఆరోగ్య సంరక్షణను విస్తరించాలనే లక్ష్యంతో సీఈఓ తీసుకున్న చొరవను కమ్యూనిటీ కుటుంబాలు ప్రశం సించాయి. ముత్తుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మధురనగర్, ఆదలనగర్, సింహాద్రినగర్, రామలింగపురం, ఓంనగర్, బీఎస్ కండ్రిగ, సీవీఆర్ నగర్, నక్కలమిట్ట గ్రామాలకు చెందిన మొత్తం 207 మంది ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ మేనేజ్‌మెంట్ మరియు అదానీ ఫౌండేషన్ బృందం ద్వారా కమ్యూనిటీ కుటుంబాలకు అందించిన వైద్య సేవల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు అరికట్టుటకు కృషి చేయాలి

## ఎస్ఐ యం. శివ రాకేష్



మనుబోలు, స్వర్ణ సాగరం :

డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు వద్దు. ఆరోగ్యం, జీవితం ముద్దు' అనే నినాదంతో మాదక ద్రవ్యాలను అరికట్టుటకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ శివ రాకేష్ సూచించారు. సోమవారం సాయంత్రం మనుబోలు మండలం కొండూరు సత్రంలో ఆపరేషన్ వజ్ర ప్రహార్ భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు నిషేధానికి పోలీసులు ఒక్కరే పోరాటం చేస్తే సరిపోదని సమాజం మొత్తం పోరాటం చేయాలన్నారు. డ్రగ్స్ పై దండయాత్ర కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొని డ్రగ్స్ ను పూర్తిగా కట్టుటకు పోలీసులకు సహకరించాలన్నారు. జాతీయ రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ను వాడాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ విశ్వనాథన్ ,కానిస్టేబుళ్ళు రమేష్,భాస్కర్ రావు,మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏర్పేడులో రూ.46 లక్షల రోడ్డు పనులకు ప్రారంభం



ఏర్పేడు స్వర్ణసాగరం ఫిబ్రవరి 24

ఏర్పేడు మండలంలో వికసిత్ భారత్ – జీ రామ్ జీ పథకం కింద సుమారు 46 లక్షల రూపాయలతో ఇసుక తాగేలికి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఉదయం కాంట్రాక్టర్ నూతలపాటి సూర్యనారాయణ నేతృతంలో ప్రారంభించారు. సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు పేరం ధనంజయులు నాయుడు, ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ కందటి శివశంకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.

# ఏకాంత సేవ.. భక్తజనసంద్రం





మనుబోలు, స్వర్ణసాగరం :

వేలాది మంది భక్తులతో కిక్కిరిసిన విశ్వనాథ స్వామి ఏకాంత సేవ మనుబోలు చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపాన వెలసి ఉన్న శ్రీ విశ్వనాథ స్వామి వారి దేవస్థానం వద్ద ఏకాంత సేవ పూజ కార్యక్రమం సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగినది . ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా గంధల్ల కృష్ణయ్య అన్నపూర్ణమ్మ గార్లు వ్యవహరించారు. ప్రముఖ అలంకార నిపుణులు గూడూరుకు చెందిన రాజేంద్ర మొదలియార్ స్వామి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఏకాంత సేవ కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నాట్యాచారిని కందల సుస్మిత నృత్య ప్రదర్శన కోలాటం భక్తులందరినీ ఆకట్టుకుంది. జానా వసుంధర మహిళలతో కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులందరినీ అలరించాయి. ఈ మహాశివరాత్రి వేడుకలకు ఏకాంత సేవ కార్యక్రమాలకు సహకరించిన విశ్వనాథ స్వామి యూత్ శివశక్తి గ్రూప్ సభ్యులకు ఆలయ అర్చకులు గందల్ల శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముంగర విజయ భాస్కర్ రెడ్డి,గుండుబోయిన వెంకటేశ్వర్లు, మేకల యోగేశ్వరరావు, గుండు బోయిన వెంకయ్య యాదవ్, గూడూరు పెంచలయ్య, పాశం నాగరాజు గారు పాల్గొన్నారు..

# "కోడూరులో ముగిసిన "తంబలవివాదం

## మధ్యవర్తిత్వంతో సమస్యకు పరిష్కారం



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 24

కోడూరు లో ఇటీవల రెడ్డి మానుతూము కింద పారుదల కాలువ తంబలు ఓ రైతు తొలగించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ విషయం జటిలం కావడంతో స్థానిక నేత రైతుకుటుంబీకులు మాజీఉప సర్పంచ్‌దువ్వూరు శ్రీనివాసుల రెడ్డి తంబలుతొలగించిన రైతుతో మాట్లాడి తంబలు యధాతథంగా వేసేందుకు తన వంతుమద్యస్థం చేసి రాజీమార్గంలో కృషి చేయడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించడం జరిగిందిఈ విషయంలో చొరవ చూపిన శ్రీనివాసుల రెడ్డిని స్థానిక రైతులు ప్రశంసించారు

# బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



ఐరాల, స్వర్ణ సాగరం ఫిబ్రవరి 24

విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలన పై అవగాహన కల్పించిన. ఐరాల మండలంలోని ఐరాల జడ్పీ హైస్కూల్, ఎం పైపల్లి హై స్కూల్ నందు బాల్య వివాహాల నిర్మూలన పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఐరాల సిడిపిఓ జి నిర్మల మాట్లాడుతూ బాల్య వివాహాలు పిల్లల ఆరోగ్యం శారీరిక మానసిక అభివృద్ధి ప్రతికూల ప్రభావం దెబ్బతీస్తుందని తెలియజేశారు. చిన్న వయసులోనే వివాహం చేయడం వలన వారి ఆరోగ్యం దెబ్బతింటుంది అని బాల్య వివాహం ఒక సామాజిక నేరమని వివరించారు. అమ్మాయికి 18 సంవత్సరాలు అబ్బాయికి 21 సంవత్సరం నిండకముందు వివాహం చేయడం చెట్టరీత్య నేరమని తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థు లు పాల్గొన్నారు.

# గణనాథుని హుండీ లెక్కింపు



## స్వామి వారి హుండీ ఆదాయం 18 రోజులకు 1,30,10,749

కాణిపాకం, స్వర్ణ సాగరం ఫిబ్రవరి 24

స్వామి వారి హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో చైర్మన్ .కాణిపాకం శ్రీ వరసిది వినాయక స్వామివారి హుండీ లెక్కింపు ద్వారా 18 రోజులకు రాబడిన ఆదాయం 1,30,10,749 రూపాయలు,బంగారం 88.గ్రాములువెండి 1. కిలో 189. గ్రాములు,గో సంరక్షణ హుండీ ద్వారా 12,832 రూపాయలు.నిత్య అన్నదానం హుండీ ద్వారా 87,484 రూపాయలు.ఫారిన్ కరెన్సీ యూఎస్ఏ 340. డాలర్స్ ఆస్ట్రేలియా 100. డాలర్స్. మలేషియా 69. రింగ్గిట్స్ .కెనడా 40. .యూరో180.యూరో. ఇంగ్లాండ్–20. పౌండ్స్.సౌదీ 5. రియాల్స్.ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెంచల కిషోర్ మరియు దేవస్థానం చైర్మన్ మణి నాయుడు , తెలిపారు, ఈ హుండీ లెక్కింపులో పాల్గొన్నవారు, చిత్తూరు అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, ట్రస్ట్ బోర్డు సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, ఏఈఓలు ఎస్వి కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, ధనపాల్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, పర్యవేక్షకులు – కోదండపాణి, శ్రీధర్ బాబు, దేవస్థానం సిబ్బంది, సేవకులు, యూనియన్ బ్యాంక్ కాణిపాకం శాఖ, తదితరులు పాల్గొన్నారు.

# ముత్తుకూరులో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సజావుగా జరిగాయి.




ముత్తుకూరు.. స్వర్ణ సాగరం

ముత్తుకూరు మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 190 మంది విద్యార్థులకు గాను 187 మంది పరీక్షలకు హాజరుకాగా, ముగ్గురు గైహాజరయ్యారు. పరీక్షల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో నిశ్శబ్ద వాతావరణం ఉండేలా చర్యలు తీసుకున్నారు. పరీక్షల నిర్వహణ సక్రమంగా సాగిందని అధికారులు తెలిపారు.

# ఇన్చార్జి సబ్ రిజిస్టర్ గా విజితా రెడ్డి

ముత్తుకూరు.. స్వర్ణ సాగరం

మండలంలోని స్టాంపులు--రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా అక్కడే విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ విజితా రెడ్డి నియమితులయ్యారు. మంగళవారం ఆమె అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ప్రసన్నలక్ష్మి, పదోన్నతి పొందుతూ విజయవాడ కమిషనర్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. విజితా రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శాఖాధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పాపా నాయుడు పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 129 మంది విద్యార్థుల హాజరు...

ఏర్పేడు స్వర్ణసాగరం ఫిబ్రవరి 24

ఎర్పేడు మండలం పాపా నాయుడు పేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సాగాయి.ఈ పరీక్షలకు మొత్తం 133 మంది విద్యార్థులకు కేటాయింపులు ఉండగా, అందులో 129 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. కాగా 4 మంది గైర్హాజరయ్యారు.విషయాల వారీగా చూస్తే, తెలుగు విభాగంలో 127 మందికి కేటాయింపులు ఉండగా 123 మంది పరీక్షలకు హాజరయ్యారు, 4 మంది గైర్హాజరయ్యారు. ఇక సంస్కృత విభాగంలో 6 మందికి కేటాయింపులు ఉండగా అందరూ పరీక్షలు రాశారు.పరీక్షల నిర్వహణ ఎటువంటి అవాంతరాలు లేకుండా సజావుగా సాగినట్లు కళాశాల వర్గాలు వెల్లడించాయి.

swarna sagaram_Swarna sagaram.qxd 2/24/2026 11:15 PM Page 2



# ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు చేసుకున్న పుణ్యఫలమే నారా చంద్రబాబునాయుడు

రామాంజులు నాయుడు కెవిబి పుర మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు





స్వర్ణ సాగరం కె వి బి పురం:

ప్రతి పల్లె వీధులు సిమెంట్ రోడ్లు నిర్మాణం జరుగుతుంది అని నాయకులు కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి రాబోయే ఎన్నికలలో ప్రతి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయాలని ఆదర్శ పాఠశాల వద్ద సిమెంట్ రోడ్డు పరిశీలించడానికి విచ్చేసిన సందర్భంగా మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రామా ంజులు నాయుడు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రామాంజులు నాయుడు తిరుపతి పార్లమెంటు రైతు అధ్యక్షులు కనపర్తి గోపీనాథ్ రెడ్డి తిరుపతి పార్లమెంటు యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్ రెడ్డి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సౌజన్య వైస్ ప్రిన్సిపాల్ కిషోర్ సార్ పీ ఈ టి ఫిరోజ్ మాజీ సర్పంచ్ వెంకటేష్ సిఆర్పి సూపర్ మోడల్ స్కూల్ కమిటీ సభ్యులు కాటయ్య వరలక్ష్మి నాగేశ్వరమ్మ సుధా సీనియర్ నాయకులు నాగరాజు రెడ్డి బాబు వగత్తూరు బూతు ఇంచార్జి వెంకటేష్ గోవిందా స్వామి పాల్గొన్నారు

# డక్కిలి ఇంటర్ ధ్వితీయ పరీక్ష కేంద్రంలోకి సిట్టుంగ్ స్కాడ్




స్వర్ణ సగరం డక్కిలి (ఫిబ్రవరి 24)

తిరుపతి జిల్లా డక్కిలి మండలంలో ఇంటర్మీడియట్ ధ్వితీయ వార్షిక పరీక్షలు మంగళవారంప్రశాంతవాతావరణంలోప్రారంభమయ్యాయి. మండలంలోని డక్కిలి డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ గురుకుల పరీక్షా కేంద్రంలోరెండోరోజుపరీక్షలకువిద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం నుంచే విద్యార్థులు హాల్‌టికెట్లు పరిశీలించించుకొని, భద్రతా తనిఖీల అనంతరం లోపలికి అనుమతించబడ్డారు.పరీక్ష కేంద్రంలోఎలాంటిఅవా ంఛనీయఘటనలు ,చోటుచేసుకోకుండా పోలీసులుబందో బస్తుని ర్వహించారు. పరీక్షలు కేంద్రానికి సిట్టింగ్ స్కాడ్ వచ్చింది. కఠినచర్యలుతీసుకుంటున్నామని చెప్పారు.మండల పరిధిలోని ఎటువంటి అవినీతి లేదా అవకాశం ఉండదని తెలియజేసారు.

# మోటర్ స్ట్రాటర్‌లకు ప్లాస్టిక్ డబ్బాలు అమర్చుకోండి

మండల విధ్యుత్ అధికారి అశోక్



స్వర్ణ సగరం డక్కిలి (ఫిబ్రవరి 24)

తిరుపతి జిల్లా డక్కిలి మండల కేంద్రంలో వ్యవసాయ రైతులు కు,విద్యుత్ అధికారులు రైతులకు ముఖ్య సూచనలు తెలియజేసారు. మండల విద్యుత్ అధికారి అశోక్ మీడియా తో మాట్లాడుతూ రైతులు మోటార్ స్ట్రాటర్ల వద్ద ఇనప (ఇనుము) డబ్బాలు ఉపయోగించడం ప్రమాదకరమని.విద్యుత్ లీకేజీ, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు పెరిగే అవకాశం ఉండటంతో, రైతులు ఇనప డబ్బాల స్థానంలో, ప్లాస్టిక్ డబ్బాలు అమర్చుకోవాలని సూచించారు.ఇటీవల కొన్ని గ్రామాల్లో రైతులు మోటర్ స్ట్రాటర్‌లకు, అమర్చిన ఇనప డబ్బాల వల్ల,విద్యుత్ షాక్ ఘటనలు చోటుచేసుకున్నట్లు సమాచారం.అదేవిధంగా ముఖ్యంగా వర్షాకాలంలోతడిసి నపరిస్థితుల్లో,ఇనప డబ్బాలు విద్యుత్ ప్రసరణకు, కారణమవుతున్నాయని,ఈ నేపథ్యంలో రైతులు స్ట్రాటర్ల వద్ద ఉన్న ఇనప డబ్బాలను తొలగించి, ప్రమాణిత నాణ్యత గల ప్లాస్టిక్ డబ్బాలను అమర్చుకోవాలని అధికారులు రైతులకు తెలియజేశారు.

# విద్యుత్ అదాలత్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

నాయుడుపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.శ్రీనివాసులు.

స్వర్ణ సాగరం (నాయుడుపేట)ఫిబ్రవరి 24.




విద్యుత్ వినియోగదారులు ఏమైనా సమస్యలపై ఫిర్యాదులు ఉంటే ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు. నాయుడుపే ట,ఓ జిలి,పేళ్లకూరు మండలాల వారు పరిష్కరించుకోవచ్చని మ ంగళవారం నాయుడుపేట డివిజన్ అధికారి వై.శ్రీనివా సులు విలేకరుల సమావేశం ద్వారా తెలియజేశారు.ఈ సంద ర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ ఫిర్యాదుల పరిష్కారాల వేదికలో చైర్ పర్సన్ రిటైర్డ్ న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయ మూర్తి,ఆర్థిక సభ్యులు జి.మధు కుమార్,సాంకేతిక సభ్యులు ఏ.శ్రీనివాస బాబు, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి సంబంధిత అధికారులు పాల్గొంటారని తెలిపారు..కావున విద్యుత్ వినియోగదారులు యొక్క పరిష్కారాలను దీర్ఘకాలిక సమస్యల వ్రాత పూర్వక ఫిర్యాదు ద్వారా తెలియపరచి వారి సమస్యలను పరిష్కారించుకోవలసిందిగా ప్రజలకు తెలియజేస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు..

# తాగు నీటి వినతికి వెంటనే స్పందన ఎంపీడీఓ జొన్నగురకలలో నీటి సరఫరా పునరుద్ధరణ

తవనంపల్లి.స్వర్ణసాగరం. ఫిబ్రవరి 24



చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం జొన్నగురకల గ్రామపంచాయతీ పరిధిలోని జొన్నగురకల కాలనీలో తాగునీటి సమస్యకు అధికారులు వేగంగా స్పందించి పరిష్కారం చూపారు. సోమవారం కాలనీవాసులు సమర్పించిన వినతిపత్రంపై డిప్యూటీ ఎంపీడీవో రాజశేఖర్ తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు.ఆదేశాల మేరకు పంచాయతీ సెక్రటరీ రామరాజు వెంటనే స్థలానికి వెళ్లి సమస్యను పరిశీలించారు. పైప్లైన్ బ్లాక్ కారణంగా నీటి సరఫరా నిలిచిపోయినట్లు గుర్తించి, ఆలస్యం చేయకుండా కొత్త పైపును ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించారు. తాత్కాలికంగా సమస్యను పరిష్కరించడంతో కాలనీవాసులకు ఉపశమనం కలిగింది.ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ సరిత రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో ఇలాంటి సమస్యలు మళ్లీ రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించేలా చూస్తామన్నారు.తక్షణ స్పందనతో సమస్యను పరిష్కరించిన అధికారులపై కాలనీలోని మహిళలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై స్పందించే ప్రజాపాలనకు ఇది నిదర్శనమని స్థానికులు పేర్కొన్నారు. త్వరలో శాశ్వత పరిష్కారం పూర్తయి కాలనీలో నీటి సమస్య పూర్తిగా తొలగిపోతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది

# మామిడిలో పూత పిందె సమయం లో చేపట్టవలసిన యాజమాన్యం పై రైతులకు శిక్షణ కార్యక్రమం







బంగారుపాళ్యం.స్వర్ణసాగరం. ఫిబ్రవరి 24

ఉద్యాన శాఖ ద్వారా బంగారు పాలెం మండల పరిధిలోని నలగాంపల్లి గ్రామం నందు మామిడిలో పూత పిందె సమయంలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఉద్యాన అధికారిని సాగరిక మాట్లాడుతూ మామిడి పచ్చి పూత దశలో తేనె మంచు పురుగు, బూడిద తెగుల నివారణకు బుప్రోఫెజిన్ 1.5 మి.లీ, హెక్సాకొనజోల్ 2మిలీ మరియు సూక్ష్మ పోషక మిశ్రమాన్ని 5గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.అనంతరం పిందె దశలో తేనె మంచు పురుగు, తామర పురుగు, నల్ల మచ్చ తెగులు, బూడిద తెగులు నివారణకు అసిఫేట్ం బుప్రోఫెజిన్ 1.5గ్రాములు ం థయోసల్ఫేట్ మిథైల్ 1గ్రాం సూక్ష్మ పోషక మిశ్రమం 5గ్రాముల చొప్పున లీటరుకు కలిపి పిచికారి చేయాలని తెలియజేశారు.కేటర్పిలర్(లద్దెపురుగు) నివారణకు ఇమేమేక్టిన్ బెంజాస్తే 0.5 స్త్రఎ జావతీ శ్రీఖ పిచికారి చేయాలన్నారు తర్వాత ప్రకృతి వ్యవసాయం గురించి అంబికా గాంధీ మాట్లాడుతూ జీవామృతం, వేప కషాయం లాంటివి పిచికారి చేసుకొని తెగుళ్లను పురుగులను నివారించవచ్చు అన్నారు.నవధాన్యాలు చల్లుకొని నేలని సారవంతం చేసుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమానికి నలగాంపల్లి రైతు సేవా సిబ్బంది జయశ్రీ,తేదేపా మండల కార్యదర్శి జనార్ధన్,రైతు నాయకులు భాస్కర్ నాయుడు,మురళి నాయుడు, మరియు నలగాంపల్లి రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు

హర్షం వ్యక్తం చేసిన ఉద్యమకారులు



స్వర్ణసాగరం డోర్నకల్ ఫిబ్రవరి 24

తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్ 8 వారాల్లో ఇవ్వాలని చారిత్రత్మక తీర్పు ఇవ్వడంతో డోర్నకల్ మండలం తెలంగాణ ఉద్యమకారులు సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సమావేశమై హైకోర్టు తీర్పు ఉద్యమకారులకు అనుకూలంగా ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారులకు అనుకూలంగా హైకోర్టు చారిత్రత్మక తీర్పు ఇచ్చినందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విధి విధానాలను ప్రకటించి సంబంధింత జీ.వో. విడుదల చేయాలని, వీటితోపాటు కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలైన ఉద్యమకారుల గుర్తింపు,మరణించిన ఉద్యమకారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం, అర్హత ఉన్న ఉద్యమకారులకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి ఉద్యమకారుల కోసం అలపెరుగని పోరాటం చేసిన చీమ శీనన్నకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి చంద్రగిరి కృష్ణమూర్తి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల రామారావు,టి యు ఎఫ్ మండల ప్రెసిడెంట్ టి యు ఎఫ్ మైనార్టీ డివిజన్ అస్గర్,టి యు ఎఫ్ టౌన్ ప్రెసిడెంట్ మామిడి నాగరాజు,టి యుఎఫ్ మైనార్టీ టౌన్ ఎస్ కే గౌస్, టి యు ఎఫ్ నాయకులు గుంటి కొమురెల్లి,గుడిమళ్ల రవి, కుర్నా శ్యాం మేడి రాజేష్, మేకపోతు ఎంకన్న, కోదాటి వెంకన్న,అబ్బాసాలి డిటిపి సౌడం మహేష్, బోడ రమేష్ గఫూర్ గాజు సురేష్, చింతల ప్రేమ్ మంగు రాజ్ కుమార్, అడ్వకేట్ కర్ణ,వెంకన్న, తదితరులు ఉన్నారుద

# అభివృద్ధి ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

కాంగ్రెస్ నాయకులు మల్లం అనిల్

స్వర్ణసాగరం డోర్నకల్ ఫిబ్రవరి 24



అభివృద్ధి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతొందని కాంగ్రెస్ నాయకులు మల్లం అనిల్ అన్నారు. మంగళవారం కుందోజు వారి వీధిలో చేపట్టిన సైడ్ డ్రైనేజ్ పనులను వారు పర్యవేక్షించారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్, సహాయ సహకారాలతో డోర్నకల్ లో అభివృద్ధి జరుగుతుందన్నారు. వారి వెంట ఎస్ కే అఫ్జల్, బాబా,రామాచారి తదితరులు ఉన్నారు

# .ఏఎంసీ కార్యాలయంలో రైతు ధరకే టమోటాలు అందుబాటులో ఉంటాయి.

ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్.

స్వర్ణ సాగరం (నాయుడుపేట)ఫిబ్రవరి 24.



టమోటా రైతుకి గిట్టుబాటు ధర కల్పించేందుకు కూటమీ ప్రభుత్వం రైతుల వద్ద నుండి టమోటాలు కొనుగోలు చేసి నేరుగా వినియోగదారులకి విక్రయించాలని నిర్ణయించడం జరిగిందని నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా మంగళవారం ఈ నెల ప్రవీణ్ మాట్లాడుతూ నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలు మూడు టన్నులు నాటు టమోటాలు వినియోగదారుల కోసం రైతు ధరకే విక్రయానికి సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. కావున ప్రజలు టమోటాలు కావాలని అనుకున్న వారు ఏఎంసీ కార్యాలయం నందు రైతు గిట్టుబాటు ధరకే కొనుగోలు చేసుకోవచ్చని ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ తెలియజేశారు.. కాంటాక్ట్ నెంబర్ 9866452009 సంప్రదించగలరని తెలిపారు..

# గ్రామ పంచాయితీల ఎన్నికలు జరిగేనా?

స్పెషల్ ఆఫీసర్ల పాలన తప్పదా?



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 24

రాష్ట్రంలో గ్రామపంచాయతీ ల గడువు ఏప్రిల్ మొదటి వారంలో ముగుస్తుండడంతో ఎన్నికలు యధావిధిగా జరుగుతాయా లేక స్పెషల్ ఆఫీసర్ల పాలన నడుస్తుందా లేదా అన్న

అభిప్రాయం సర్వత్ర వినవొస్తుంది. ఎన్నికల కమిషన్ మార్చినాటికి ఎన్నికల జాబితా ప్రచురించాలన్న ఆదేశాలతో అధికారులు అందుకు సిద్ధమవుతున్నారు. సుప్రీం కోర్ట్ ఆదేశాల ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50% లోపు ఉండాలన్న ప్రతిభంధకం పాలకులకు కష్టంగా మారింది. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లు 33% పెంచాలన్న ముఖ్యమంత్రి అభిప్రాయం ఎంతవరకు సాధ్యమవుతుందో వేచి చూడాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్ల పెంపు ప్రక్రియ రాష్ట్ర శాసనసభ తో పాటు పార్లమెంటు కూడా ఆమోదించాల్సి ఉంటుంది. రిజర్వేషన్ల నిర్ణయాలపై ఎవరైనా న్యాయస్థానాలను ఆశ్రయిస్తే ఎన్నికల ప్రక్రియ జాప్యం అయ్యే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తుంది. మొత్తం మీద పంచాయతీ ఎన్నికలపై ఆయా రాజకీయ పార్టీలు తమ తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు

swarna sagaram_Swarna sagaram.qxd 2/24/2026 11:15 PM Page 3



మా కలం - సామాన్యుడి బలం
RNI No : APTEL/2020/15905
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# "కోడి వ్యర్ధాలు వాడితే" "కఠిన చర్యలు"

### అనుమతులు లేకుండా ఆక్వా సాగు చేయడం చట్ట విరుద్ధం జిల్లా మత్స్యశాఖ అధికారి కే శాంతి సహాయ అధికారి చాంద్ భాష "హెచ్చరిక"

**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఫిబ్రవరి 24**

ప్రజా ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా కోడి వ్యర్ధాల వినియోగాన్ని నిలిపివేయాలని అదేవిధంగా అనుమతులు లేకుండా ఆక్వా సాగు చేయరాదని రాష్ట్ర ఆక్వా అభివృద్ధి ప్రాధికార చట్టం 2020 అనుసరించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా మత్స్యశాఖ అధికారి కే శాంతి సహాయ అధికారి చాంద్ బాషా హెచ్చరించారు. అనుమతులు లేకుండా సాగు కొనసాగిస్తే భారీ జరిమానాలు మత్స్య సంపద స్వాధీనం విద్యుత్ సరఫరా నిలిపివేత వంటి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కోడి వ్యర్ధాలను చేపల ఆహారంగా వాడడం వల్ల చెరువుల నీరు తీవ్రంగా కలుషితంగా మారి హానికర బ్యాక్టీరియా పెరిగి చేపలు రోగాలకు గురవుతున్నాయని తెలిపారు. ఈ ప్రభావం ప్రజల ఆరోగ్యం పై అవకాశం ఉందని హెచ్చరించారు. మండలంలోని 22 గ్రామపంచాయతీల రైతులు ఈ విషయంలో నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని మత్స్యశాఖ అధికారులు గుర్తు చేశారు











# చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..

### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**కోవూరు, స్వర్ణ సాగరం , ఫిబ్రవరి 23:**

రాష్ట్రంలోని చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్య తనిస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ (ఆ×ఔఫ్) ప్రతినిధి బృందం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించింది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, చేనేతల కు ఊరటనిచ్చేలా ఏప్రిల్ 1 నుండి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసేందుకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఆప్కో (ఆ్రాజూ) సంస్థకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టిటి)లో చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని తప్పనిసరి చేస్తూ ఆదేశాలు ఇచ్చామని తెలిపారు...

**ముఖ్యమంత్రి పేర్కొన్న ప్రధానాంశాలు..**

సహకార సంఘాల ద్వారా చేనేత కార్మికులకు మెరుగైన



ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

ఆర్థిక వెసులుబాటును బట్టి చేనేతలకు మరిన్ని ప్రయోజనాలు చేకూర్చేలా త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం.ప్రభుత్వానికి అండగా ఉన్న చేనేత సామాజిక వర్గాన్ని అన్ని విధాలా కాపాడుకుంటాం.నెల్లూరు జిల్లా పార్లమెంటు మరియు కోవూరు నియోజకవర్గ పరిధిలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతి రెడ్డి దంపతులు చేనేత క్లస్టర్ల ఏర్పాటుకు చేస్తున్న కృషిని, తుఫాను సమయంలో కార్మికులకు ప్రభుత్వ సాయం అందేలా వారు తీసుకున్న చొరవను ఆ×ఔఫ్ కేంద్ర కమిటీ సభ్యుడు కేవీ శేషయ్య ముఖ్యమంత్రికి వివరించారు.అనంతరం, ఫెడరేషన్ ప్రతినిధులు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని ఆమె నివాసంలో కలిసి, చేనేతల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆ×ఔఫ్ జాతీయ అధ్యక్షుడు పప్పు దుర్గా రమేష్, కోర్ కమిటీ సభ్యులు కేవీ శేషయ్య, కరేళ్ల గణపతి రావు, దొంతంశెట్టి సత్య ప్రకాష్ మరియు గుంటుకు చంద్రశేఖర్ ఉన్నారు.

# బడ్జెట్‌లో అంగన్వాడీలకు ప్రాధాన్యం ఎక్కడ?,

### రెండో రోజు రిలే దీక్షలు...

### వేతనాల పెంపుపై స్పష్టత కోరిన సీఐటీయూ,




**స్వర్ణసాగరం- తొట్టంబేడు,**

తొట్టంబేడు మండల కేంద్రంలోని అంగన్వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగాయి.సెంటర్ అఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ), ఇండియన్ ఫెడరేషన్ అఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఐఎఫ్‌టీయూ) నాయకులు ఈ కార్యక్రమానికి మద్దతుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3.32 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో అంగన్వాడీ కార్యకర్తల వేతనాల పెంపుపై ఎలాంటి స్పష్టమైన ప్రకటన లేకపోవడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 20 నెలలు గడిచినా, అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి కనబరచడం లేదని విమర్శించారు.రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరల నేపథ్యంలో ప్రస్తుత వేతనాలు కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్తహీనత నివారణ, పౌష్టికాహార పంపిణీపై గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, ఆ పథకాలను అమలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలే ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటం విరుద్ధమని వ్యాఖ్యానించారు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 'సమాన పనికి సమాన వేతనం' అమలు చేసి ప్రతి అంగన్వాడీ కార్యకర్తకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసి అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరారు.అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేవరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈనెల 25, 26, 27 తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట రిలే దీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంధం మణి, రాజా, రేవతి, పుష్ప, సక్కుబాయి, ఐఎఫ్‌టీయూ నాయకులు జాకీర్, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న అంగన్వాడీల 2వ రోజు రిలే నిరాహార దీక్షలు

**రేణిగుంట స్వర్ణ సాగరం ఫిబ్రవరి 24**






అంగన్వాడి అక్క చెల్లెమ్మలకు ఎన్నికల ముందు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మంగళవారం నాడు రేణిగుంట ఐసిడిఎస్ కార్యాలయం వద్ద 2వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా మల్లి, సుజాత, నూర్జహాన్, చెంచమ్మ, చంద్రమ్మ, పద్మ, జ్యోషిని, మన్నెమ్మ, సుగుణ 9 మందికి పూల మాల వేసి రిలే నిరాహార దీక్ష శిబిరం లో కూర్చోవడం జరిగింది. ఈ అంగన్వాడీ దీక్షలకు మద్దతుగా ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.ఈశ్వరమ్మ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొండ్రెడ్డి హరినాథ్, రేణిగుంట మండల కన్వీనర్ సెల్వరాజ్, రైతు సంఘం ఏర్పేడు కార్యదర్శి వెంకటాద్రి కలసి దీక్షా శిబిరంలో కూర్చొని వారికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షురాలు రంగయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె. ఈశ్వరమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 43 రోజులు సమ్మె చేస్తూ దీక్షలు చేపట్టారని అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు డిమాండ్లు పరిష్కరిస్తామని చెప్పిన ఆనాటి ప్రభుత్వం ఇచ్చి మాట తప్పిందని, తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న అంగన్వాడి అక్క చెల్లెమ్మల డిమాండ్లు పరిష్కరించకపోవడం దారుణం అన్నారు. సిఐటియు రేణిగుంట మండల కన్వీనర్ కాన్జేరి సెల్వరాజ్ మాట్లాడుతూ అంగన్వాడి సమస్యలను పరిష్కరిస్తామని కూటమి నాయకత్వం ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చి ఇంతవరకు అమలు చేయలేదు. తెలుగుదేశం కూటమి ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి లేదని అన్నారు. అందుకే మండల కేంద్రంలో ఉండే ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ఫిబ్రవరి 23, 24 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు, అదేవిధంగా ఫిబ్రవరి 25, 26, 27 తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే రిలే నిరాహార దీక్షలో అంగన్వాడి కార్మికులు కూర్చుని నిరసన తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. రేణిగుంట అంగన్వాడి ప్రాజెక్టు కార్యదర్శి ధనమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు ఇస్తున్న 11,500రూ. వేతనం, అంగన్వాడి హెల్పర్ కు ఇస్తున్న 7,000రూపాయలు వేతనం ను సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం 26 వేలు రూపాయలు వరకు జీతం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవి సెలవులు, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, మెనూ చార్జీలు పెంపు, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం సప్లై చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్వాడీలకు వర్తింపు చేయాలని, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు ఇవ్వాలని, గ్రాట్యుటీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, వెంకటాద్రి, ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కె ఈశ్వరమ్మ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొండ్రెడ్డి హరినాథ్, కరీముల్లా, రేణిగుంట మండల కన్వీనర్ కాంజేరి సెల్వరాజ్, సంఘమిత్ర మండల కార్యదర్శి లక్ష్మి, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, పాండురంగమ్మ, రేణిగుంట మండలం, ఏర్పేడు మండలం కు చెందిన అంగన్వాడి ప్రాజెక్టు హెల్పర్స్ ఈ రిలే నిరాహార దీక్షలో కూర్చోవడం జరిగింది.

# విద్యుత్ అదాలత్ నేడు




**పెళ్ళకూరు స్వర్ణసాగరం ఫిబ్రవరి 24.**

పెళ్ళకూరులోని విద్యుత్ ఉపకేంద్రం నందు బుధవారం విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. అందువల్ల మండలంలోని విద్యుత్ వినియోగదారులందరూ తమ సమస్యలను విద్యుత్ శాఖ అధికారులకు రాతపూర్వకంగా విన్నవించుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కాకాణి జోలికొస్తే తగిన గుణపాఠం చెప్తాం: వైకాపా నేతలు



**మనుబోలు, స్వర్ణ సాగరం :**

మాజీ మంత్రి కాకాణి ని విమర్శిస్తే మనుబోలులో తిరగలేవని తెలుగు యువత అధ్యక్షులు శివుడు రాజా గౌడ్ కు వైకాపా నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.మంగళవారం వైకాపా నేతలు మనుబోలులోని దాసరి భాస్కర్ గౌడ్ నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గడిచిన రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం పలానా ప్రజలకి చేశాము అని చెప్పుకోగలద అంటూ సూటిగా ప్రశ్నించారు. తమ హయాంలో ప్రతి గ్రామంలో పేదలకు ఇల్లు, నాడు నేడు పాఠశాలల,అభివృద్ధి సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలవలు చేశామని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వంలో టీడీపీ నేతలు కోర్టుకు వెళ్లి బిల్లులు తెచ్చుకోలేదా అంటూ ప్రశ్నించారు. కేవలం మీ అవినీతి బట్టలు బయలు చేస్తున్నామని కప్పిపుచ్చుకోవడానికి మా నాయకుడి పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలుగు యువత అధ్యక్షుడు స్థానికుడు కాదని గుర్తుంచుకోవాలన్నారు. మా నాయకుడు ఇల్లు ముట్టడించే దమ్ము నీకు ఉందా అంటూ సవాల్ విసిరారు. మా నాయకుడి జోలికొస్తే తగిన గుణపాఠం చెప్పగల యువత మాకు ఉందని గుర్తుంచుకోవాలన్నారు. శివుడు రాజా గౌడ్ కుటుంబంలోనే మా ప్రభుత్వంలో లక్ష రూపాయలకు పైగా పథకాలు అందించామని గుర్తు చేశారు. గ్రామాల్లో ఫలానా అభివృద్ధి చేశామని చెప్పుకోగలరా అంటూ సూటిగా ప్రశ్నించారు.ప్రజలు మీకు గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని హెచ్చరించారు. నోరు ఒళ్ళు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బొమ్మి రెడ్డి హరి గోపాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గడివేటి చంద్రశేఖర్ రెడ్డి, ముంగర రవీందర్ రెడ్డి,ఇంద్రసేన కుడుముల వెంకట రమణయ్య, రమణారెడ్డి ఆవుల తులసి,మహేంద్ర వర్మ, హరినాథ్ రెడ్డి పరిమళ శివరాం,రవికుమార్, కొలిపి శ్రీనివాసులు పెద్ద ఎత్తున వైకాపా నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# 26 న జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు ప్రారంభం.




### జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్.

**స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఫిబ్రవరి 24.**

జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకుఈ నెల 26వ తేదీ నుండి జనసేన ఉద్యమి సభ్యత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభ మవుతుందని జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్ అన్నారు.మంగళవారం నాయుడుపేట పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో తిరుపతి పార్లమెంట్ పరిదిలోని సూళ్లూరుపేట,సర్వేపల్లి, గూడూరు నియోజకవర్గాల జనసేన నాయకులతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూతిరుపతి పార్లమెంట్ పరిదిలోని అన్ని నియోజకవర్గాలకు తిరుపతి ఎమ్మెల్యే ఆరాణి శ్రీనివాసులును సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పరిశీలకులుగా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నియమించారని తెలిపారు.త్వరలో ఎమ్మెల్యే ఆరాణి శ్రీనివాసులు అన్ని నియోజకవర్గాలు పర్యాటస్తారని తెలియజేసారు.400 రూపాయలు సభ్యత్వం రుసుము కట్టి ఉద్యమి సభ్యత్వ నమోదు చేసుకున్నవారికి పార్టీ గుర్తింపుతో పాటు, రూ.500000 ప్రమాద భీమా లేదా హాస్పిటల్ ఖర్చులకి రూ. 50000 ఇవ్వడం జరుగుతుందన్నారు.ఇది కేవలం ప్రమాదవశాత్తు సంబవించిన సంఘటనలకే వర్తిస్తుందన్నారు.భవిష్యత్తులో జనసేన పార్టీ తరపున పోటీ చేయదలసిన వారికి ఉద్యమి సభ్యత్వం తప్పనిసరిగా ఉండాలని అధ్యక్షులు నిర్ణయించిన్నట్లు తెలిపారు.సూళ్లూరుపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు,వీర మహిళలు,ఉత్సాహంగా ఉద్యమి సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు,గూడూరు నియోజకవర్గం నుండి ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు రాష్ట్ర లీగల్ సెల్ సెక్రెటరీ తీగల చంద్రశేఖర రావు,గూడూరు నియోజకవర్గం పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ మోహన్,జనసేన పార్టీ సీనియర్ నాయకులు అట్ల కృష్ణారావు,నాయుడుపేట ఏఎంసీ డైరెక్టర్ గిండి సతీష్, నాయుడుపేట శ్రీ పోలేరమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ బాలు శెట్టి,జ్యోతిష్,మూడు నియోజకవర్గాల జనసేన నాయకులు,జనసైనికులు పాల్గొన్నారు.

స్వర్ణసాగరం





# ఆ సంఘటన నన్ను ఎంతగానో గాయపరిచింది

తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుస విజయాలతో దూసుకుపోతుంది యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. బ్లాక్ బస్టర్ హిట్ 'కార్తికేయ-2' షూటింగ్ సమయంలో జరిగిన ఒక సంఘటన తనను ఎంతగా కలచివేసిందో ఆమె వివరించారు. 'కార్తికేయ-2' షూటింగ్ సమయంలో సెట్స్‌లో ఒక మేకపిల్ల ఉండేదని, దానితో తాను ఎంతో ఇష్టంగా ఆడుకునేదాన్ని అని అనుపమ తెలిపారు. "ఆ మేకపిల్లతో గడపడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చేది. అయితే ఒకరోజు షూటింగ్ గ్యాప్‌లో మాకు మటన్ బిర్యానీ వడ్డించారు. నేను తింటున్న సమయంలో నా అసిస్టెంట్ నా దగ్గరకు వచ్చి నవ్వుతూ.. 'మేడం, మీరు ఇప్పుడు తింటున్నది మీరు ఇందాక ఆడుకున్న మేకపిల్లనే' అని చెప్పాడు" అంటూ ఆనాటి చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నారు. అసిస్టెంట్ చెప్పిన మాట వినగానే తాను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానని, వెంటనే వాంతులు చేసుకున్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘటన తనను ఎంతగా గాయపరిచిందంటే.. అప్పటి నుంచి తాను మటన్ ముట్టుకోవడమే మానేశానని తెలిపారు. దాదాపు కార్తికేయ-2 సమయం నుంచి ఇప్పటి వరకు మటన్ జోలికి వెళ్ళలేదని, అయితే ఇటీవల కాలంలోనే మళ్ళీ నెమ్మదిగా తినడం ప్రారంభించానని ఆమె వెల్లడించారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వారంతా.. మూగజీవాల పట్ల ఆమెకు ఉన్న ప్రేమే ఆమెను అన్ని ఏళ్లపాటు మటన్‌కు దూరంగా ఉంచిందని, అనుపమ సున్నిత మనస్తత్వాన్ని మెచ్చుకుంటున్నారు. ఇక అనుపమ సినిమాల విషయానికొస్తే.. ఇటీవల 'లాక్‌డౌన్' సినిమాతో అలరించిన అనుపమ, ప్రస్తుతం 'క్రేజీ కళ్యాణం' అనే సినిమాలో నటిస్తున్నారు.



# అత్యంత తక్కువ టికెట్ ధరకు హే బల్‌వంత్

కొన్ని సంవత్సరాల వెనక్కి వెళ్లినట్లయితే తెలుగు సినిమా పరిశ్రమలో టికెట్ ధరలు కాస్త తక్కువగా ఉండేవి. అలాగే ఓటీటీల వెసులుబాటు కూడా లేదు.దానితో పెద్ద ఎత్తున ఫ్యామిలీ ఆడియన్స్, యూత్, కామన్ ప్రేక్షకులు కూడా సినిమాను థియేటర్కు వెళ్లి చూసేవారు. దానితో కాస్త మంచి సినిమాలకు సూపర్ వసూళ్లు దక్కడం, యావరేజ్ సినిమాలు కూడా బ్రేక్ ఈవెన్ ను కంప్లీట్ చేసుకునేవి. కానీ కొన్ని సంవత్సరాలుగా స్టార్ హీరోల సినిమాలకు టికెట్ ధరలను భారీగా పెంచుతున్నారు. అలాగే కొంచెం క్రేజ్ ఉన్న సినిమాల టికెట్ ధరలను కూడా అలాగే పెంచేస్తున్నారు. ఇక సినిమా విడుదల అయ్యి నెల తిరగకుండానే ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. దానితో చాలామంది ప్రేక్షకులు అంత డబ్బు పోసి సినిమాను థియేటర్కు వెళ్లి చూడాలా? నెల రోజుల్లోనే ఇంట్లో అంతా కలిసి చూడొచ్చు అనే అభిప్రాయానికి వచ్చేసారు. దానితో స్టార్ హీరోల సినిమాలకు బ్లాక్బస్టర్ టాక్ వచ్చిన సందర్భంలో, మరికొన్ని సినిమాలకు మాత్రమే పెద్ద ఎత్తున కలెక్షన్లు వస్తున్నాయి. చాలా చిత్రాలు బ్రేక్ ఈవెన్ కావడం కష్టంగా మారింది. దానితో చిన్న సినిమాల నిర్మాతలు కొత్త స్ట్రాటజీతో ముందుకు వస్తున్నారు. తమ సినిమాను అత్యంత తక్కువ టికెట్ ధరకు చూడండి అని ఆఫర్లు ఇస్తున్నారు. తాజాగా ఇదే ఫార్ములాను సుహాస్, శివానీ నాగారం జంటగా గోపి అచ్చర దర్శకత్వంలో రూపొందిన హే బల్‌వంత్ మూవీ యూనిట్ కూడా ఫాలో అయ్యింది. తాజాగా ఈ మూవీ బృందం వారు 99 రూపాయలకే రెండు తెలుగు రాష్ట్రాల్లోని మేజర్ స్క్రీన్లలో ఈ సినిమాను ప్రదర్శిస్తున్నట్లు, తక్కువ టికెట్ ధరకు ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయండి అని ఆఫర్ను ఇచ్చారు. మరి ఈ ఆఫర్ సినిమా వసూళ్లపై ఏ స్థాయి ప్రభావాన్ని చూపిస్తుందో చూడాలి.



# ఆ సమయంలో మళ్లీ ఎవరినైనా నమ్ముతానని అనుకోలేదు

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేశారు. గత కొద్ది కాలంగా ఇండస్ట్రీకి దూరంగా ఉన్న ఆమె 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.ఈ మూవీ పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో.. తాజాగా, ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె తన వ్యక్తిగత జీవితం గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా నాగచైతన్యతో విడాకుల తర్వాత తన పరిస్థితి ఎలా ఉండేదో, రాజ్ నిడిమోరు పరిచయం తనను ఎలా మార్చిందో ఆమె వివరించారు. "నేను విడాకులు తీసుకున్న సమయంలో చాలా కుంగిపోయాను. నా చుట్టూ ఒక గోడ కట్టుకుని ఎవరినీ రానివ్వలేదు. మళ్ళీ ఎవరినైనా నమ్ముతానని లేదా వేరొకరిపై ఆధారపడతానని అస్సలు ఊహించలేదు. కానీ, రాజ్ అందించిన ప్రేమను, స్నేహాన్ని స్వీకరించే మనస్తత్వం నాకు ఉండటం నా అదృష్టం. రాజ్ లాంటి వ్యక్తి నా జీవితంలో ఉండటం వల్ల నేను ఇప్పుడు ఒక మంచి మనిషిగా మారాను" అని సమంత ఎమోషనల్ అయ్యారు. తనలో వచ్చిన ఈ సానుకూల మార్పును అందరూ గమనిస్తున్నారని, తన పాత స్నేహితురాలు కూడా ఈ విషయాన్ని నేరుగా చెప్పారని సమంత పేర్కొన్నారు. విడిపోయిన ప్రారంభ రోజుల్లో చాలా లో-ఫేజ్‌లో ఉన్న తనకు, రాజ్‌తో ఏర్పడిన స్నేహం జీవితం పట్ల ఉన్న నమ్మకాన్ని మార్చేసిందని ఆమె వెల్లడించారు. 2021లో 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' సెట్స్‌లో వీరిద్దరికీ పరిచయం ఏర్పడగా, అది కాలక్రమేణా బలపడి గతేడాది వివాహ బంధానికి దారితీసింది. పెళ్లి చేసుకుని వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఈ జంట తమ పర్సనల్ లైఫ్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు.



# అన్నం పెట్టే ఇండస్ట్రీని గౌరవించండి

టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలిగి, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ బిజీగా ఉన్న రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొని నటుల బాధ్యతలపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.ఒక నటిగా తన వృత్తి పట్ల తనకు ఎంత గౌరవం ఉందో చెబుతూ, భాష తెలియకుండా నటించే వారిపై ఆమె పరోక్షంగా చురకలు వేశారు. చాలామంది నటీనటులు ఇతర భాషల్లో నటించేటప్పుడు డైలాగులకు బదులుగా కేవలం అంకెలు (1, 2, 3) లేదా 'అఆ' లు చెబుతూ మేనేజ్ చేస్తుంటారు. దీనిపై రకుల్ స్పందిస్తూ.. "నేను స్వతహాగా మోసగత్తెను కాదు. సెట్స్‌లో 1, 2, 3 లేదా అ ఆ అని చెప్పి నా లైన్లను నేను పూర్తి చేయలేను. ఒక పరిశ్రమ మనకు అన్నం పెడుతున్నప్పుడు మనం దాన్ని గౌరవించాలి. మనకు ఇంత ప్రేమను ఇస్తున్నప్పుడు.. కనీసం ఆ భాషను నేర్చుకోవడం మనం చేయాల్సిన కనీస బాధ్యత" అని ఆమె స్పష్టం చేశారు. తనకు ఎలాంటి పాత్రలు చేయాలని ఉందనే విషయంపై రకుల్ మాట్లాడుతూ.. "ఒక నటిగా నాకు విభిన్నమైన, ముఖ్యంగా నెగటివ్ రోల్స్ చేయడమంటే చాలా ఇష్టం. అది చాలా ఆకర్షణీయంగా అనిపిస్తుంది. అయితే ఇందులో ఒక సమస్య ఉంది. మీరు ఒకసారి నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపిస్తే, మేకర్స్ మిమ్మల్ని మళ్ళీ 'గర్ల్ నెక్స్ట్ డోర్' (పక్కింటి అమ్మాయి) పాత్రల్లో చూడటానికి ఇష్టపడరు" అని తన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక నటిగా పరిపూర్ణత కోసం తాను పడే తపనను వివరించిన రకుల్, భాష ఏదైనా సరే అందులో లీనమై నటించడమే తన విజయ రహస్యమని చెప్పుకొచ్చారు.